'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి ‖ సంపుటి : 1 ‖ సంచిక : 18 ‖ బుధవారం ‖ 2.9.2026 ‖ పేజీలు : 8 ‖ వెల రూ. 2

Medchal Malkajgiri ‖ Volume: 1 ‖ Issue: 18 ‖ Wednesday ‖ 2.9.2026 ‖ Pages: 8 ‖ Rate: 2

# ఢిల్లీకి చేరిన కొండా పంచాయితీ



- హైకమాండ్ పిలుపుతో హస్తినకు సురేఖ
- కేసీ వేణుగోపాల్‌తో కీలక భేటీ

తెలంగాణ కాంగ్రెస్‌లో మరోసారి రాజకీయ ఉత్కంఠ పెరిగింది. మంత్రి కొండా సురేఖకు ఢిల్లీ హైకమాండ్ నుంచి పిలుపు రావడంతో ఆమె హస్తినకు వెళ్లారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఆమె భేటీ కానున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అపాయింట్‌మెంట్ కోసం కూడా సురేఖ ప్రయత్నించినట్లు తెలుస్తోంది. దీంతో హైకమాండ్ పెద్దలు సురేఖతో ఏం చర్చించబోతున్నారు? ఆమెపై ఎలాంటి నిర్ణయం తీసుకోబోతున్నారు? అనే ప్రశ్నలు కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## కేసీ వేణుగోపాల్‌తో రేవంత్ భేటీ

### ఢిల్లీలో కీలక రాజకీయ చర్చలు



తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాల మధ్య సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు, పార్టీ అంతర్గత వ్యవహారాలపై ఇరువురి మధ్య సుదీర్ఘంగా చర్చ జరిగినట్లు సమాచారం. ముఖ్యంగా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ, ఖాళీగా ఉన్న నామినేటెడ్ పోస్టుల భర్తీ అంశాలు చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. (వివరాలు 2లో..)



2లో..

## ప్రజాస్వామ్యం ఎక్కడ?

**ఇండియాకు వి-డెమ్ రిపోర్టు షాక్**

**1975 తర్వాత అత్యంత దిగువకు**

**ఓటర్ల తొలగింపుపై యూఎన్ ఆందోళన**

భారత్‌లో ప్రజాస్వామ్య పరిస్థితులపై విడెమ్ ఇన్‌స్టిట్యూట్ తాజా నివేదిక తీవ్ర ఆందోళన కలిగించే చిత్రాన్ని చూపించింది. 1975 తర్వాత భారత్ ప్రజాస్వామ్య సూచీ అత్యల్ప స్థాయికి పడిపోయినట్లు నివేదిక పేర్కొంది. ఈ పరిణామాన్ని ఇటీవల ఐక్యరాజ్యసమితి జాతి వివక్ష నిర్మూలన కమిటీ (సీఈఆర్డీ) వ్యక్తం చేసిన ఆందోళనలతో పోల్చి చూడొచ్చని విశ్లేషణ చెబుతోంది. భారత్‌పై 2007 తర్వాత తొలిసారి సమీక్ష నిర్వహించిన సీఈఆర్డీ చట్ట అమలు సంస్థల అధికారుల ద్వారా పెద్ద ఎత్తున ఉల్లంఘనలు జరుగుతున్నాయన్న నివేదికలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో పెద్ద సంఖ్యలో ఓటర్లు జాబితా నుంచి తప్పించబడుతున్నారన్న అంశాన్ని ప్రస్తావించింది. అందులో ముస్లిం ఓటర్ల విషయంలో ఎదురవుతున్న సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది.



## డాక్టర్లపై దాడి చేస్తే నో బెయిల్

**వైద్యులపై దాడికి ఓన్లీ జైల్**

**ఆసుపత్రిలో దాడులపై సీరియస్ యాక్షన్**

ఆసుపత్రుల్లో వైద్యులపై దాడి చేసే ఘటనలను తేలిగ్గా తీసుకోలేమని సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. మహారాష్ట్రలోని థానే జిల్లాలో మున్సిపల్ ఆసుపత్రి వైద్యులపై దాడి చేసిన కేసులో శివసేన కార్పొరేటర్ రమేష్ మ్హాత్రే బెయిల్ షరతులను సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. (వివరాలు 2లో..)



## స్మార్ట్ ఫోన్లకు తమిళనాడు ఆలయాల్లో నో ఎంట్రీ

**52 ఆలయాల్లో నిర్ణయం అమలుకు నిర్ణయం**

తమిళనాడులోని 52 ప్రముఖ ఆలయాల్లో స్మార్ట్‌ఫోన్‌లపై నిషేధం మొదలైంది. సెప్టెంబర్ 1 నుంచి నిర్ణయం అమల్లోకి వచ్చింది. ధర్మాదాయ శాఖ పరిధిలోని ఈ ఆలయాల్లో భక్తులు స్మార్ట్‌ఫోన్లు తీసుకెళ్లడం, వినియోగించడం ఇకపై కుదరదు. (వివరాలు 3లో..)





## కాంగ్రెస్‌తో మంతనాలు చేయలేదా?

### కవితపై ప్రశాంత్‌రెడ్డి ఎదురుదాడి

కాంగ్రెస్‌లో చేరేందుకు పలువురు నేతలను కలిసి రాయబేరాలు నడిపిన కవిత.. తనపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కేసీఆర్‌కు నమ్మకంగా ఉన్న నేతలను విడదీసి బీఆర్‌ఎస్‌ను బలహీనపర్చడమే కవిత లక్ష్యంగా కనిపిస్తోందని ఆరోపించారు. తాను కాంగ్రెస్ నేతలతో మంతనాలు జరిపినట్లు కవిత చెప్పగలరా? అదే విధంగా కవిత రహస్యంగా కాంగ్రెస్ నాయకులతో చర్చలు జరపలేదని చెప్పగలరా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌ను కలపడానికి, విడగొట్టడానికి కవిత ప్రయత్నించిన విషయాలు ఆయనకు తెలుసన్నారు. (వివరాలు 2లో..)

## హిట్ అండ్ రన్ కేసు

**ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్‌సాయి కొడుకు అరెస్ట్**

హైదరాబాద్‌లో జరిగిన హిట్ అండ్ రన్ ఘటనకు సంబంధించి ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్‌సాయి కుమారుడు సందీప్‌ను రాయదుర్గం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరో విద్యార్థి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఓఆర్ఆర్ రోటరీ నుంచి ఖాజాగూడ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. (వివరాలు 2లో..)





## నీట్ నిరసనలపై కేసులకు సుప్రీం చెక్

**జెన్-జీ ఆందోళనకారులకు కేసుల ఊరట**

**ఆర్టికల్ 142తో కీలక తీర్పు**

నీట్ యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరిగిన జెన్ జీ విద్యార్థుల నిరసనలకు సంబంధించి నమోదైన క్రిమినల్ కేసులను సుప్రీంకోర్టు సంచలన నిర్ణయంతో కొట్టివేసింది. (వివరాలు 3లో..)



## ఫీజు బకాయిలతో విద్యకు తూట్లు!

**రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఆగ్రహం**

**రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు ఫైర్**

ప్రపంచస్థాయి విద్యా వ్యవస్థ అంటూ గొప్పలు చెప్పుకునే సీఎం రేవంత్‌రెడ్డి.. నెలలు గడుస్తున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడం సిగ్గుచేటని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. గత రెండున్నరేళ్లుగా నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో తెలంగాణలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నాయని ఆరోపించారు. అధ్యాపకులు, నాన్‌టీచింగ్ సిబ్బందికి నెలల తరబడి జీతాలు అందడం లేదని, అద్దెలు, విద్యుత్ బిల్లులు, యూనివర్సిటీ ఫీజులు, నిర్వహణ ఖర్చులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌కి ఓకే

**పథకాల అమలుపై హైకోర్టు తీర్పు**

(వివరాలు 2లో..)

## రాంచందర్‌రావు అరెస్ట్‌పై నితిన్ నబీన్ ఫైర్

### తెలంగాణ బీజేపీకి జాతీయ అధ్యక్షుడి భరోసా



తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావుకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఫోన్ చేసి రాష్ట్రంలో చోటుచేసుకున్న పరిణామాలపై ఆరా తీశారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయ గేట్లకు యువజన కాంగ్రెస్ నాయకులు నల్లరంగు వేయడం, బీజేపీ నేతలను హౌస్ అరెస్ట్ చేయడం, రాంచందర్‌రావు అరెస్ట్ అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, కాంగ్రెస్ 1000 రోజుల పాలనా వైఫల్యంపై పోరాడుతున్నందుకే తమపై దాడులు చేస్తున్నారని రాంచందర్‌రావు వివరించినట్లు సమాచారం. (వివరాలు 2లో..)



## కాంగ్రెస్-బీజేపీ ఘర్షణలతో ఉద్రిక్తత

### యాదాద్రి భువనగిరిలో భగ్గు భగ్గు • క్యాంప్ ఆఫీస్‌పై దాడితో మొదలు

కాంగ్రెస్-బీజేపీ కార్యకర్తల మధ్య వరుస ఘర్షణలతో యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంపై బీజేవైఎం కార్యకర్తలు దాడి చేశారు. కార్యాలయంలోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేయడంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే చిత్రాలపై నల్లరంగు పూశారు. సోమవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయ గేట్లకు కాంగ్రెస్ నాయకులు నల్లరంగు వేసిన ఘటనకు ప్రతీకారంగానే ఈ దాడి జరిగినట్లు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.

(వివరాలు 2లో..)



6లో..

## పాపులేషన్ పాలిటిక్స్ పబ్లిక్ పల్స్... పొలిటికల్ సెన్స్

**జనాభా లెక్కలు.. రాజకీయ లెక్కలు!**

**దేశంలో ప్రజాస్వామ్యానికి కొత్త సవాళ్లు**

ఒక కుటుంబంలో పిల్లల సంఖ్య మారితే అది ఆ ఇంటి నిర్ణయం. కానీ ఒక రాష్ట్రంలో పిల్లల సంఖ్య తగ్గితే? ఒక ప్రాంతంలో యువత పెరిగితే? మరో రాష్ట్రంలో వృద్ధుల సంఖ్య భారీగా పెరిగితే? అప్పుడు అది కేవలం జనాభా గణాంకం కాదు.. రాజకీయ భవిష్యత్తును మార్చే శక్తి! భారతదేశం ఇప్పుడు అలాంటి కీలక మలుపు వద్ద నిలిచింది. జననాల రేటు తగ్గుతోంది. ప్రజల ఆయుర్దాయం పెరుగుతోంది. ఉపాధి కోసం కోట్లాది మంది రాష్ట్రాల సరిహద్దులు దాటి వెళ్తున్నారు. ఒకవైపు యువ జనాభాతో ఉత్సాహంగా ఉన్న రాష్ట్రాలు, మరోవైపు వేగంగా వృద్ధాప్యంలోకి వెళ్తున్న రాష్ట్రాలు. ఈ వ్యత్యాసం రేపటి ఎన్నికల్లో ఎవరికి ఎన్ని సీట్లు? కేంద్ర నిధుల్లో ఎవరి వాటా ఎంత? అభివృద్ధి వనరులు ఎక్కడికి వెళ్లాలి? అన్న ప్రశ్నలను ముందుకు తెస్తోంది. జనాభా పెరుగుదల కోసం ఎక్కువ మంది పిల్లలను కనాలని రాజకీయ నాయకులు పిలుపునివ్వడం ఈ మార్పునకు మరో కోణం. కానీ అసలు సమస్య అక్కడే లేదు. కుటుంబాలు పిల్లల సంఖ్యను నిర్ణయించేది కేవలం రాజకీయ పిలుపులతో కాదు. విద్య, ఉద్యోగం, ఇల్లు, వైద్యం, జీవన వ్యయం, భవిష్యత్తుపై భరోసా వంటి అంశాలే నిర్ణయిస్తాయి. ఇప్పుడు జనగణన2027... నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో జనాభా రాజకీయాలుగా మారుతోంది. లెక్కలు మారితే.. ప్రజాస్వామ్య సమీకరణాలు కూడా మారుతాయా?

## దీన్ని కూడా వదలరా..

- ఐస్‌క్రీమ్ బిజినెస్‌లోకి రిలయన్స్
- పది రూపాయలకే బాంబే క్రీమరీ
- చౌక చౌక అంటూ మార్కెట్‌లోకి

దేశంలోని మరో వినియోగ వస్తువుల మార్కెట్‌పై రిలయన్స్ కన్నేసింది. ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ తాజాగా 'బాంబే క్రీమరీ' పేరుతో ఐస్‌క్రీమ్ బ్రాండ్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చింది. కేవలం రూ.10 నుంచే ఐస్‌క్రీమ్ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావడం ఇప్పుడు మార్కెట్ లో ఆసక్తికర చర్చకు కారణమైంది. కోన్స్, కప్స్, టబ్స్, బార్స్, స్టిక్స్ రూపాల్లో ఉత్పత్తులను విక్రయించనుంది. తొలుత పశ్చిమ భారతదేశంలో అమ్మకాలు ప్రారంభించి... త్వరలోనే దేశవ్యాప్తంగా విస్తరించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ఐస్‌క్రీమ్ రంగంలో అమూల్, వాడీలాల్, మదర్ డెయిరీ, క్వాలిటీ వాల్స్, హ్యాట్సన్ అగ్రోకు చెందిన అరుణ్ వంటి బలమైన బ్రాండ్లు ఉన్నాయి. అంతర్జాతీయ బ్రాండ్లు మ్యాగ్నమ్, బాస్కిన్ రాబిన్స్ కూడా పోటీ పడుతున్న ఈ మార్కెట్ లో రిలయన్స్ తక్కువ ధర వ్యూహంతో అడుగుపెట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది.





3లో..

## హైడ్రా రంగనాథ్‌కు ఊరట



**సింగిల్ జడ్జి ఆదేశాలకు బ్రేక్**

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో కీలక ఊరట లభించింది. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కేసులో ఆయనపై సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను డివిజన్ బెంచ్ తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. దీంతో రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ పదవి నుంచి మార్చాలన్న సింగిల్ జడ్జి ఆదేశాలకు ప్రస్తుతానికి బ్రేక్ పడింది. (వివరాలు 2లో..)

# ఢిల్లీకి చేరిన కొండా పంచాయితీ

- హైకమాండ్ పిలుపుతో హస్తినకు సురేఖ
- కేసీ వేణుగోపాల్‌తో కీలక భేటీ




తెలంగాణ కాంగ్రెస్‌లో మరోసారి రాజకీయ ఉత్కంఠ పెరిగింది. మంత్రి కొండా సురేఖకు ఢిల్లీ హైకమాండ్ నుంచి పిలుపు రావడంతో ఆమె హస్తినకు వెళ్లారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఆమె భేటీ కానున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అపాయింట్‌మెంట్ కోసం కూడా సురేఖ ప్రయత్నించినట్లు తెలుస్తోంది. దీంతో హైకమాండ్ పెద్దలు సురేఖతో ఏం చర్చించబోతున్నారు? ఆమెపై ఎలాంటి నిర్ణయం తీసుకోబోతున్నారు? అనే ప్రశ్నలు కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

### కుమార్తె వ్యాఖ్యలతో మొదలైన వివాదం

గత కొంతకాలంగా కొండా సురేఖ, ఆమె కుమార్తె కొండా సుస్మితకు సంబంధించిన వ్యవహారం తెలంగాణ కాంగ్రెస్‌లో కలకలం రేపుతోంది. ఇటీవల గీసుకొండలో సీఎం రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై సుస్మిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. పార్టీ నేతల్లో అసంతృప్తి వ్యక్తం కావడంతో టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ స్పందించింది. సుస్మిత వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అయితే తన కుమార్తె వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని, అవి వ్యక్తిగత వ్యాఖ్యలని సురేఖ వివరణ ఇచ్చారు. అనంతరం ఈ వ్యవహారంపై రూపొందించిన నివేదికను టీపీసీసీ హైకమాండ్‌కు పంపినట్లు సమాచారం. దీంతో ఢిల్లీ భేటీలో ఈ అంశంపై సురేఖ వివరణ ఇచ్చే అవకాశం కనిపిస్తోంది.

### మంత్రి పదవిపై ఊహాగానాలు

సురేఖ ఢిల్లీ పర్యటనతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి కూడా రెండు రోజుల పర్యటనకు హస్తిన చేరడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. సీఎం వెళ్లిన కొద్దిసేపటికే సురేఖ ఢిల్లీ చేరుకోవడంతో కాంగ్రెస్ అంతర్గత వ్యవహారాలపై కీలక చర్చలు జరుగుతున్నాయనే ప్రచారం మొదలైంది. హైకమాండ్ కేవలం వివరణ తీసుకుని వ్యవహారాన్ని ముగిస్తుందా? లేక క్రమశిక్షణ పరంగా చర్యలు తీసుకుంటుందా? అనే చర్చ సాగుతోంది. కఠిన నిర్ణయం వస్తే మంత్రి పదవికి సురేఖ రాజీనామా చేసే అవకాశముందనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. మరోవైపు ఖాళీగా ఉన్న కేబినెట్ స్థానాల భర్తీ, కొత్త మంత్రుల ఎంపికపై కూడా ఢిల్లీలో చర్చ జరిగే అవకాశం ఉంది. ఇదే సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఖర్గేతో భేటీ కావడం కూడా రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. మొత్తంగా ఢిల్లీ పర్యటనలు తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త సమీకరణాలకు సంకేతాలా? అన్న చర్చ ఇప్పుడు జోరందుకుంది.

# కేసీ వేణుగోపాల్‌తో రేవంత్ భేటీ

## ఢిల్లీలో కీలక రాజకీయ చర్చలు

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాల మధ్య సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు, పార్టీ అంతర్గత వ్యవహారాలపై ఇరువురి మధ్య సుదీర్ఘంగా చర్చ జరిగినట్లు సమాచారం. ముఖ్యంగా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ, ఖాళీగా ఉన్న నామినేటెడ్ పోస్టుల భర్తీ అంశాలు చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. అదే సమయంలో మంత్రి కొండా సురేఖ, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ జారీ చేసిన షోకాజ్ నోటీసులు, వాటిపై వారు ఇచ్చిన వివరణలపైనా చర్చ జరిగినట్లు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో పార్టీలో నెలకొన్న పరిస్థితిని కూడా సీఎం రేవంత్ వేణుగోపాల్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. పార్టీ క్రమశిక్షణ, నేతల మధ్య సమన్వయం, రాబోయే రాజకీయ నిర్ణయాలు వంటి అంశాలపై హైకమాండ్ వైఖరిని తెలుసుకునేందుకు సీఎం ఈ భేటీ నిర్వహించినట్లు తెలుస్తోంది. మరోవైపు, తెలంగాణ కేబినెట్‌లో ఖాళీగా ఉన్న స్థానాల భర్తీపై కూడా త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. ఢిల్లీలో సీఎం రేవంత్ వరుసగా కాంగ్రెస్ అగ్రనేతలను కలుస్తుండటం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది.




# కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌కి ఓకే

## పథకాల అమలుపై హైకోర్టు తీర్పు

తెలంగాణ ప్రభుత్వానికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల విషయంలో హైకోర్టులో కీలక ఊరట లభించింది. ఈ రెండు సంక్షేమ పథకాల అమలుపై సింగిల్ బెంచ్ విధించిన మధ్యంతర స్టేను సీజే ధర్మాసనం ఎత్తివేసింది. పథకాలపై స్టే విధించడాన్ని సవాల్ చేస్తూ ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌పై మంగళవారం విచారణ జరిగింది. 2014 నుంచి ప్రభుత్వం జారీ చేసిన ఎనిమిది జీవోలను సవాల్ చేస్తూ న్యాయవాది విజయ్‌గోపాల్ వ్యక్తిగత హోదాలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంతో సింగిల్ జడ్జి పథకాల అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. దీనిపై ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పిటిషనర్‌కు ఈ పథకాల వల్ల ఎలాంటి ప్రత్యక్ష ప్రభావం లేదని, ఆయన హక్కులకు ఎలాంటి భంగం కలగలేదని ఏజీ కోర్టుకు వివరించారు. అంతేకాక ఆయన పథకం లబ్ధిదారు కూడా కాదని, ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని పేర్కొన్నారు. షాదీ ముబారక్ తరహా పథకాన్ని సుప్రీంకోర్టు అనుమతించిన విషయాన్ని ప్రస్తావించారు. కల్యాణలక్ష్మి కూడా అదే తరహా సంక్షేమ పథకమని తెలిపారు. ప్రభుత్వ విధాన నిర్ణయాలను సవాల్ చేసిన ఈ పిటిషన్ సింగిల్ బెంచ్ పరిధిలో విచారణార్హం కాదని వాదించారు. ఏజీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం స్టేను ఎత్తివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో రెండు పథకాల అమలు యథావిధిగా కొనసాగనుంది.

# రాంచందర్‌రావు అరెస్ట్‌పై నితిన్ నబీన్ ఫైర్

## తెలంగాణ బీజేపీకి జాతీయ అధ్యక్షుడి భరోసా



తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావుకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఫోన్ చేసి రాష్ట్రంలో చోటుచేసుకున్న పరిణామాలపై ఆరా తీశారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయ గేట్లకు యువజన కాంగ్రెస్ నాయకులు నల్లరంగు వేయడం, బీజేపీ నేతలను హౌస్ అరెస్ట్ చేయడం, రాంచందర్‌రావు అరెస్ట్ అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, కాంగ్రెస్ 1000 రోజుల పాలనా వైఫల్యంపై పోరాడుతున్నందుకే తమపై దాడులు చేస్తున్నారని రాంచందర్‌రావు వివరించినట్లు సమాచారం.

### వర్షిత్‌రెడ్డి ఇంటిపై దాడి

నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఇంటిపై జరిగిన దాడి విషయాన్ని కూడా రాంచందర్‌రావు నితిన్ నబీన్‌కు వివరించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న ప్రతిపక్ష నేతను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని నితిన్ నబీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు దాడులకు పాల్పడినప్పుడు మౌనంగా ఉన్న ప్రభుత్వ యంత్రాంగం.. బాధితులకు అండగా నిలిచేందుకు వెళ్లిన బీజేపీ నేతలపై మాత్రం చర్యలు తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు.

### పోరాటం కొనసాగించాలంటూ భరోసా

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం కొనసాగించాలని రాంచందర్‌రావుకు నితిన్ నబీన్ సూచించారు. ఏ పరిస్థితుల్లోనైనా పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. వర్షిత్‌రెడ్డికి కూడా స్వయంగా ఫోన్ చేసి మాట్లాడతానని తెలిపారు. రాహుల్ గాంధీ రాజ్యాంగ పరిరక్షణపై చెప్పే మాటలు ఆచరణలో కనిపించడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని నితిన్ నబీన్ ఎక్స్ వేదికగా విమర్శించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నాలకు తెలంగాణ ప్రజలు తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు.

# కాంగ్రెస్-బీజేపీ ఘర్షణలతో ఉద్రిక్తత

- యాదాద్రి భువనగిరిలో భగ్గు భగ్గు
- క్యాంప్ ఆఫీస్‌పై దాడితో మొదలు

కాంగ్రెస్-బీజేపీ కార్యకర్తల మధ్య వరుస ఘర్షణలతో యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంపై బీజేవైఎం కార్యకర్తలు దాడి చేశారు. కార్యాలయంలోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేయడంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే చిత్రాలపై నల్లరంగు పూశారు. సోమవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయ గేట్లకు కాంగ్రెస్ నాయకులు నల్లరంగు వేసిన ఘటనకు ప్రతీకారంగానే ఈ దాడి జరిగినట్లు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.

### బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ దాడి

బీజేపీ కార్యకర్తల దాడికి ప్రతిగా కాంగ్రెస్ కార్యకర్తలు భువనగిరిలోని బీజేపీ జిల్లా కార్యాలయంపై దాడికి దిగారు. కార్యాలయంపై రాళ్లు రువ్వడంతో పాటు పలువురు బీజేపీ కార్యకర్తలపై దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇరువర్గాలు పరస్పరం ఘర్షణకు దిగడంతో పోలీసులు రంగంలోకి దిగి లాఠీచార్జ్ చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఇంటిపైనా దాడి జరిగినట్లు పార్టీ నేతలు ఆరోపించారు. ఘటనలకు నిరసనగా చౌటుప్పల్, చండూరులో బీజేపీ ఆందోళనలు చేపట్టింది. దిష్టిబొమ్మల దహనాన్ని పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట చోటుచేసుకుంది. పలువురు బీజేపీ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు.

### రాంచందర్‌రావు హౌస్ అరెస్ట్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావును పోలీసులు హౌస్ అరెస్ట్ చేసి యాదాద్రి భువనగిరి వెళ్లకుండా అడ్డుకున్నారు. పార్టీ నేతలను కలిసేందుకు వెళ్తున్న తనను అడ్డుకోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వరుస హౌస్ అరెస్ట్‌లతో తనను మౌనం చేయలేరని స్పష్టం చేశారు. తెలంగాణలో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని ఎక్స్ వేదికగా ఆరోపించారు. ఈ పరిణామాలపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రాంచందర్‌రావుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. అరెస్ట్ అయిన నేతల వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం కొనసాగించాలని సూచించినట్లు సమాచారం. దీంతో జిల్లాలో రాజకీయ ఉద్రిక్తత మరింత పెరిగింది.



# ఫీజు బకాయిలతో విద్యకు తూట్లు!

### 650కి పడిపోయిన కళాశాలలు

ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఒకప్పుడు రాష్ట్రంలో సుమారు 960గా ఉన్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఇప్పుడు దాదాపు 650కి తగ్గిపోయాయని, ఇప్పటికే 310 వరకు కళాశాలలు తగ్గాయని హరీశ్‌రావు తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే మరిన్ని కళాశాలలు మూతపడే ప్రమాదం ఉందన్నారు. దీని ప్రభావం గ్రామీణ తెలంగాణపై ఎక్కువగా పడుతుందని, చిన్న పట్టణాలు, మండలాల్లో ప్రైవేట్ కళాశాలలే పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యకు ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ భరోసాగా నిలిచిందని గుర్తుచేశారు. కళాశాలలు మూతపడితే వేలాది మంది విద్యార్థుల ఉన్నత విద్యకు ఆటంకం ఏర్పడుతుందని హెచ్చరించారు.

### రూ.10 వేల కోట్ల బకాయిలంటూ ఆరోపణ

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు రూ.2,500 కోట్ల బకాయిలు ఉన్నాయని, వాటిని చెల్లించి పథకాన్ని కొనసాగించామని హరీశ్‌రావు చెప్పారు. పెద్ద నోట్ల రద్దు, కరోనా సమయంలోనూ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆపలేదన్నారు. తొమ్మిదిన్నరేళ్లలో రూ.19,500 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్‌గా కేసీఆర్ ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పాత బకాయిలతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తిగా చెల్లిస్తామని హామీ ఇచ్చిందని, మూడు బడ్జెట్లు పూర్తయినా దాదాపు రూ.10 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని ఆరోపించారు. పెండింగ్ నిధులను తక్షణమే విడుదల చేయాలని, ప్రతి విద్యా సంవత్సరానికి నిర్ణీత గడువులో నిధులు చెల్లించే శాశ్వత విధానం తీసుకురావాలని డిమాండ్ చేశారు. బకాయిలు విడుదల చేయకపోతే అసెంబ్లీని స్తంభింపజేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# హిట్ అండ్ రన్ కేసు

## ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్‌సాయి కొడుకు అరెస్ట్





హైదరాబాద్‌లో జరిగిన హిట్ అండ్ రన్ ఘటనకు సంబంధించి ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్‌సాయి కుమారుడు సందీప్‌ను రాయదుర్గం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరో విద్యార్థి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఓఆర్ఆర్ రోటరీ నుంచి ఖాజాగూడ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న నందులాల్‌ను ఇన్నోవా వాహనం ఢీకొట్టినట్లు పోలీసులు గుర్తించారు. తీవ్రంగా గాయపడిన నందులాల్‌ను ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నిస్తుండగా మరో వాహనం ఢీకొనడంతో ఘటన మరింత విషాదంగా మారింది.

### విద్యార్థికి తీవ్ర గాయాలు

నందులాల్‌ను ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించిన విద్యార్థి జైద్ షా ఖాద్రీని కూడా వాహనం ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ వరుస ప్రమాదాల్లో నందులాల్ తీవ్ర గాయాలతో మృతి చెందగా, జైద్ షా ఖాద్రీకి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. రెండు ఢీకొన్లకు సంబంధించిన వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

### వాహనం స్వాధీనం.. దర్యాప్తు ముమ్మరం

ప్రమాదానికి సంబంధించిన సమాచారాన్ని సేకరించిన రైదుర్గం పోలీసులు రెండో ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించి సందీప్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదానికి ఉపయోగించిన వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రమాదం జరిగిన తీరు, రెండు ఢీకొన్ల మధ్య సంబంధం, హిట్ అండ్ రన్ పరిస్థితులపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకునేందుకు సీసీటీవీ దృశ్యాలు, ఇతర ఆధారాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. నందులాల్ మృతితో కుటుంబంలో విషాదం నెలకొనగా, విద్యార్థి జైద్ పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు తెలుస్తోంది.

# కాంగ్రెస్‌తో మంతనాలు చేయలేదా?

## కవితపై ప్రశాంత్‌రెడ్డి ఎదురుదాడి

కాంగ్రెస్‌లో చేరేందుకు పలువురు నేతలను కలిసి రాయబేరాలు నడిపిన కవిత.. తనపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కేసీఆర్‌కు నమ్మకంగా ఉన్న నేతలను విడదీసి బీఆర్ఎస్‌ను బలహీనపర్చడమే కవిత లక్ష్యంగా కనిపిస్తోందని ఆరోపించారు. తాను కాంగ్రెస్ నేతలతో మంతనాలు జరిపినట్లు కవిత చెప్పగలరా? అదే విధంగా కవిత రహస్యంగా కాంగ్రెస్ నాయకులతో చర్చలు జరపలేదని చెప్పగలరా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌ను కలపడానికి, విడగొట్టడానికి కవిత ప్రయత్నించిన విషయాలు ఆయనకు తెలుసన్నారు.

### కష్టకాలంలో కేసీఆర్ వెంటే

తాను, తన తండ్రి వేముల సురేందర్‌రెడ్డి టీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యులమని ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ ఉద్యమానికి ముందే పార్టీతో ఉన్న తమను కవిత మధ్యలో వచ్చిన వ్యక్తిగా చూడటం సరికాదని అన్నారు. ప్రస్తుతం కష్టకాలంలో కేసీఆర్ వెంట ఎవరు నిలిచారో ప్రజలకు తెలుసన్నారు. అసెంబ్లీలో, బయట రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నది తానా? కవితనా? అని నిలదీశారు. వ్యక్తిగత స్వలాభం కోసం తన ప్రతిష్టను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు చేయడం తగదన్నారు. కేసీఆర్, కేటీఆర్‌పై కవిత విమర్శలు చేసినా ఆశ్చర్యం లేదని, అయితే తనపై ఆరోపణలు చేయడం బాధ కలిగించిందన్నారు.

### తండ్రీబిడ్డలను విడదీసిన వేముల

నిజామాబాద్‌లో జరిగిన పాంచజన్యం సంకల్ప సభలో కవిత ప్రశాంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. తనకు, కేసీఆర్‌కు మధ్య విభేదాలు రావడానికి ప్రశాంత్‌రెడ్డే ప్రధాన కారణమని ఆరోపించారు. తండ్రీబిడ్డలను విడదీయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని అన్నారు. జీవితంలో ఎవరినైనా క్షమించగలనని, కానీ ప్రశాంత్‌రెడ్డిని మాత్రం క్షమించనని స్పష్టం చేశారు. ఆయన పార్టీ మారేందుకు ప్రయత్నించిన విషయం తనకు తెలుసని, అయినా కేసీఆర్ ఆయననే నమ్ముతున్నారని వ్యాఖ్యానించారు.





# డాక్టర్లపై దాడి చేస్తే నో బెయిల్

## వైద్యులపై దాడికి ఓన్లీ జైల్

- ఆసుపత్రిలో దాడులపై సీరియస్ యాక్షన్



ఆసుపత్రుల్లో వైద్యులపై దాడి చేసే ఘటనలను తేలిగ్గా తీసుకోలేమని సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. మహారాష్ట్రలోని థానే జిల్లాలో మున్సిపల్ ఆసుపత్రి వైద్యులపై దాడి చేసిన కేసులో శివసేన కార్పొరేటర్ రమేష్ మ్హాత్రే బెయిల్ షరతులను సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ సందర్భంగా జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఏజీ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం “వైద్యులపై దాడి చేసేవారు బెయిల్‌కు అర్హులు కారు” అంటూ మౌఖికంగా వ్యాఖ్యానించింది. ఆసుపత్రిలోకి వెళ్లి ఎవరినైనా కొట్టడం సమర్థనీయం కాదని, వైద్య వర్గానికి గౌరవం లేకపోవడం తీవ్ర అంశమని కోర్టు పేర్కొంది. గుంపుగా దాడి జరిగితే వైద్యులపై పడే మానసిక ఒత్తిడిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది.

### బెయిల్‌పై హైకోర్టు కఠిన షరతులు

వైద్యుల ఆందోళనల తర్వాత బాంబే హైకోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించింది. తొలుత దిగువ కోర్టు ఇచ్చిన బెయిల్‌ను నిలిపివేసిన హైకోర్టు.. ఆ నిర్ణయం తీవ్రంగా తప్పుదోవ పట్టించేలా ఉందని వ్యాఖ్యానించింది. అనంతరం ఆగస్టు 7న రమేష్ మాత్రేకు బెయిల్ మంజూరు చేస్తూ చార్జిషీట్ దాఖలయ్యే వరకు మహారాష్ట్రలో ఉండకూడదని, గోవాలోని కలంగుట్‌లో ఉండాలని, వారానికి మూడు సార్లు అంజునా పోలీస్ స్టేషన్‌లో హాజరు కావాలని షరతులు విధించింది. ఎన్నికైన ప్రజాప్రతినిధి తన ఓటర్లపై దాడి చేస్తే అది ప్రజాస్వామ్య వ్యవస్థపైనే దాడి అవుతుందని హైకోర్టు అప్పట్లో వ్యాఖ్యానించింది. మరోవైపు మాత్రే తరఫు న్యాయవాది వైద్యులపై వ్యక్తిగత కక్ష లేదని వాదించారు. అయితే ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పటికే వైరల్ అయిందని కోర్టు గుర్తుచేసింది. రాష్ట్ర ప్రభుత్వం బెయిల్ రద్దు కోసం పిటిషన్ దాఖలు చేయనుండగా, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కూడా బెయిల్‌ను వ్యతిరేకించింది. ఈ పిటిషన్ కోసం వేచి చూస్తామని సుప్రీంకోర్టు తెలిపి తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

### గొడవకు దారితీసిన అసలు ఘటన

ఈ కేసుకు సంబంధించిన ఘటన జూలై 6న థానేలోని శాస్త్రి నగర్ మున్సిపల్ ఆసుపత్రిలో జరిగింది. గర్భిణికి చికిత్స ఆలస్యమైందని ఆమె కుటుంబ సభ్యులు ఆసుపత్రి సిబ్బందిపై ఆరోపణలు చేయడంతో మాత్రేతో పాటు మరికొందరు అక్కడికి చేరుకున్నారు. అనంతరం వైద్యులపై దాడి జరిగినట్లు కేసు నమోదైంది. ఘటనకు సంబంధించిన దృశ్యాలు బయటకు రావడంతో వైద్యులు ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో వైద్యుల భద్రత, ఆసుపత్రుల్లో దాడులను అరికట్టడం, ఇలాంటి కేసుల్లో బెయిల్ విషయంలో న్యాయస్థానాల వైఖరిపై సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# భారత్‌లో ప్రజాస్వామ్యం ఎక్కడ?

- ఇండియాకు వి-డెమ్ రిపోర్టు షాక్
- 1975 తర్వాత అత్యంత దిగువకు
- ఓటర్ల తొలగింపుపై యూఎన్ ఆందోళన

### ప్రజాస్వామ్య వెనుకబాటుపై వి-డెమ్ హెచ్చరిక

యూఎన్ కమిటీ వ్యక్తం చేసిన ఆందోళనలకు వి డెమ్ తాజా ప్రజాస్వామ్య నివేదికలోని పరిశీలనలు దగ్గరగా ఉన్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. స్వీడన్‌లోని గోథెన్‌బర్గ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా పనిచేసే విడెమ్ ఇన్‌స్టిట్యూట్ ప్రజాస్వామ్యాన్ని ఒకే అంశంతో కాకుండా ఎన్నికలు, పౌర హక్కులు, రాజకీయ భాగస్వామ్యం, ప్రభుత్వ జవాబుదారీతనం వంటి అనేక ప్రమాణాల ఆధారంగా అంచనా వేస్తుంది. ఈ విధానంలో భారత్ ప్రజాస్వామ్య పనితీరులో వెనుకబడుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయని తాజా నివేదిక సూచిస్తోంది. ముఖ్యంగా ఓటర్ల హక్కులు, ఎన్నికల ప్రక్రియపై వస్తున్న ఆందోళనలు ప్రజాస్వామ్య వ్యవస్థపై చర్చకు దారితీస్తున్నాయి. 1975 తర్వాత అత్యల్ప రేటింగ్ నమోదైందన్న అంశం ఈ నివేదికలో అత్యంత కీలకమైన అంశంగా మారింది. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై అంతర్జాతీయ స్థాయిలో పెరుగుతున్న పరిశీలనకు ఇది మరో సంకేతంగా కనిపిస్తోంది.

# హైడ్రా రంగనాథ్‌కు ఊరట

## సింగిల్ జడ్జి ఆదేశాలకు బ్రేక్

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో కీలక ఊరట లభించింది. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కేసులో ఆయనపై సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను డివిజన్ బెంచ్ తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. దీంతో రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ పదవి నుంచి మార్చాలన్న సింగిల్ జడ్జి ఆదేశాలకు ప్రస్తుతానికి బ్రేక్ పడింది. తదుపరి విచారణను నవంబర్ 3కి వాయిదా వేసిన కోర్టు, అప్పటి వరకు ఈ ఉత్తర్వులపై స్టే కొనసాగించేలా ఆదేశాలు ఇచ్చింది. ఇదే సమయంలో లోతుకుంట భూముల విషయంలో తదుపరి ఆదేశాలు వెలువడే వరకు హైడ్రా జోక్యం చేసుకోవద్దని స్పష్టం చేసింది. సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేస్తూ రంగనాథ్ డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఆయన తరఫున హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాజీవ్ శక్దర్ వాదనలు వినిపించారు. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కేసులో రంగనాథ్‌ను తప్పించి మరో అధికారిని నియమించాలని సింగిల్ జడ్జి గతంలో ఆదేశించారు. ఈ నిర్ణయంపై రంగనాథ్ అప్పీల్ చేయడంతో డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. నవంబర్ 3న జరిగే తదుపరి విచారణలో కోర్టు తీసుకునే నిర్ణయంపై ఇప్పుడు ఆసక్తి నెలకొంది.

### స్మార్ట్ ఫోన్లకు తమిళనాడు
## ఆలయాల్లో నో ఎంట్రీ

- 52 ఆలయాల్లో నిర్ణయం అమలు



తమిళనాడులోని 52 ప్రముఖ ఆలయాల్లో స్మార్ట్‌ఫోన్‌లపై నిషేధం మొదలైంది. సెప్టెంబర్ 1 నుంచి నిర్ణయం అమల్లోకి వచ్చింది. ధర్మాదాయ శాఖ పరిధిలోని ఈ ఆలయాల్లో భక్తులు స్మార్ట్‌ఫోన్లు తీసుకెళ్లడం, వినియోగించడం ఇకపై కుదరదు. ఇప్పటికే పళని, తిరుచెందూర్, మదురై, రామేశ్వరం ఆలయాల్లో మొబైల్ ఫోన్లపై ఆంక్షలు అమల్లో ఉన్నాయి. కోర్టు ఆదేశాల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి రమేష్ తెలిపారు. ఆలయాల్లో భక్తులకు ప్రశాంతమైన, ఆధ్యాత్మిక వాతావరణం కల్పించడమే ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. దేవతా విగ్రహాలు, ఆలయ శిల్పాలను ఫొటోలు తీయడం, వీడియోలు రికార్డు చేయడం పెరిగిపోవడంతో ఈ చర్య తీసుకున్నట్లు పేర్కొన్నారు.

#### కెమెరా లేని ఫోన్‌కు అనుమతి

అయితే కెమెరా లేని సాధారణ మొబైల్ ఫోన్లను ఆలయాల్లోకి అనుమతించనున్నారు. స్మార్ట్‌ఫోన్లు తీసుకొచ్చే భక్తుల కోసం ఆలయ ప్రవేశద్వారాల వద్ద ప్రత్యేక డిపాజిట్ కౌంటర్లు, లాకర్ సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఫోన్ భద్రపరిచేందుకు రూ.5 రుసుము చెల్లించాలి. సిబ్బంది ప్లాస్టిక్ టోకెన్ ఇస్తారు. ఆలయం నుంచి బయటకు వచ్చిన తర్వాత టోకెన్ చూపించి, మొబైల్ నంబర్ తనిఖీ చేయించుకుని ఫోన్ తిరిగి తీసుకోవాలి. తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయంలో నిషేధం అమలులోకి వచ్చిన తొలి రోజే భక్తులు ఫోన్లు డిపాజిట్ చేసేందుకు క్యూలో నిలబడ్డారు.

#### రోజూ వచ్చే భక్తుల్లో అసంతృప్తి

అయితే ఈ నిబంధనపై కొందరు భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రోజూ ఆలయానికి వచ్చే స్థానిక భక్తులకు ప్రతిరోజూ రూ.5 చెల్లించి ఫోన్ డిపాజిట్ చేయడం భారంగా మారుతుందన్న భావన వ్యక్తవుతోంది. ఫోన్లను ఆఫ్ చేసి బ్యాగుల్లో ఉంచుకునే అవకాశం కల్పించాలని కొందరు కోరుతున్నారు. మరోవైపు ఆలయ సిబ్బంది మాత్రం కొత్త బాధ్యతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీదైన స్మార్ట్‌ఫోన్ల భద్రత పూర్తిగా తమ బాధ్యతగా మారుతుందని, ఏదైనా పొరపాటు జరిగితే సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వాపోతున్నారు. పండుగల సమయంలో చెప్పులు కూడా కలిసిపోతుంటాయని, మొబైల్ ఫోన్ల విషయంలో మరింత జాగ్రత్త అవసరమని సిబ్బంది అభిప్రాయపడుతున్నారు.




#### దీన్ని కూడా వదల్రా...

## ఐస్‌క్రీమ్ బిజినెస్‌లోకి రిలయన్స్

- పది రూపాయలకే బాంబే క్రీమరీ
- చౌక చౌక అంటూ మార్కెట్‌లోకి

దేశంలోని మరో వినియోగ వస్తువుల మార్కెట్‌పై రిలయన్స్ కన్నేసింది. ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ తాజాగా 'బాంబే క్రీమరీ' పేరుతో ఐస్‌క్రీమ్ బ్రాండ్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చింది. కేవలం రూ.10 నుంచే ఐస్‌క్రీమ్ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావడం ఇప్పుడు మార్కెట్‌లో ఆసక్తికర చర్చకు కారణమైంది. కోన్స్, కప్స్, టబ్స్, బార్స్, స్టిక్స్ రూపాల్లో ఉత్పత్తులను విక్రయించనుంది. తొలుత పశ్చిమ భారతదేశంలో అమ్మకాలు ప్రారంభించి... త్వరలోనే దేశవ్యాప్తంగా విస్తరించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ఐస్‌క్రీమ్ రంగంలో అమూల్, వాడీలాల్, మదర్ డెయిరీ, క్వాలిటీ వాల్స్, హ్యాట్సన్ అగ్రోకు చెందిన అరుణ్ వంటి బలమైన బ్రాండ్లు ఉన్నాయి. అంతర్జాతీయ బ్రాండ్లు మ్యాగ్నమ్, బాస్కిన్ రాబిన్స్ కూడా పోటీ పడుతున్న ఈ మార్కెట్‌లో రిలయన్స్ తక్కువ ధర వ్యూహంతో అడుగుపెట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది.

#### టెలికాం, కూల్‌డ్రింక్స్ బాటలోనే

రిలయన్స్‌కు తక్కువ ధరతో ప్రత్యర్థులపై ఒత్తిడి తీసుకురావడం కొత్త కాదు. పదేళ్ల క్రితం జియో ద్వారా టెలికాం రంగంలోకి ప్రవేశించి తక్కువ ధరలతో భారీ వినియోగదారుల బేస్‌ను సొంతం చేసుకుంది. అనంతరం క్యాంపా బ్రాండ్‌ను పునరుద్ధరించి కూల్‌డ్రింక్స్ మార్కెట్‌లోకి ప్రవేశించింది. ఇప్పుడు అదే దూకుడు ఐస్‌క్రీమ్ రంగంలోనూ కనిపిస్తోంది. మార్కెట్ విశ్లేషకుల ప్రకారం.. రిలయన్స్‌కు ఉన్న విస్తృత రిటైల్ నెట్‌వర్క్, పంపిణీ వ్యవస్థ, వినియోగదారుల డేటా కొత్త బ్రాండ్‌కు ప్రధాన బలంగా మారవచ్చు. రాయిటర్స్ పరిశీలనలో అమూల్ మ్యాంగో ఐస్‌క్రీమ్ స్టిక్ రూ.20గా ఉండగా.. బాంబే క్రీమరీ రూ.10 ధరతో వినియోగదారులను ఆకర్షించే అవకాశం ఉంది. తక్కువ ధరతో తొలిసారి కొనేవారిని ఆకట్టుకుని, వారిని రిపీట్ వినియోగదారులుగా మార్చడమే అసలు సవాల్ కానుంది.

#### ఫ్రీజర్ల నుంచి ఫుల్ మార్కెట్ వరకు

ఐస్‌క్రీమ్ వ్యాపారంలో ఉత్పత్తి ధరతో పాటు దుకాణాల్లో లభ్యత కీలకం. సాధారణంగా కంపెనీలు రిటైల్ దుకాణాలకు ఫ్రీజర్లు ఏర్పాటు చేసి తమ ఉత్పత్తులు ఎప్పుడూ కనిపించేలా చూస్తాయి. రిలయన్స్ ఇప్పటికే క్యాంపా బ్రాండ్ పేరుతో దుకాణాల్లో ఫ్రిజ్‌లను ఏర్పాటు చేసిన అనుభవం కలిగి ఉంది. ఇదే మౌలిక వ్యవస్థను ఐస్‌క్రీమ్ విస్తరణకు ఉపయోగించుకునే అవకాశం ఉంది. విశ్లేషకుల అంచనా ప్రకారం.. ధర, రిటైల్ చేరిక, పంపిణీ, డేటా వంటి అంశాలను ఒకేసారి కలిపి ఉపయోగించగలిగితే రిలయన్స్ జాతీయ స్థాయి బ్రాండ్లతో పాటు ప్రాంతీయ కంపెనీలపై కూడా గణనీయమైన ఒత్తిడి తీసుకురాగలదు. టెలికాం నుంచి కూల్‌డ్రింక్స్ వరకు కనిపించిన రిలయన్స్ విస్తరణ వ్యూహంలో ఐస్‌క్రీమ్ మరో కీలక అడుగుగా మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

## ఏపీలో సర్ గడువు పొడిగింపు

- ఓటర్లకు ఈసీ మరో అవకాశం
- సెప్టెంబర్ 10 వరకు ఛాన్స్

ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో కీలక మార్పు చోటుచేసుకుంది. ఓటర్ల జాబితాలో పేర్లు చేర్చడం, తొలగింపులపై అభ్యంతరాలు వ్యక్తం చేయడం కోసం గడువును సెప్టెంబర్ 10, 2026 వరకు ఎన్నికల సంఘం పొడిగించింది. ఈ విషయాన్ని ఏపీ ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ మంగళవారం అధికారికంగా వెల్లడించారు. వాస్తవానికి క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణకు జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు గడువు ఉండగా.. తాజాగా మరో 11 రోజులు అవకాశం కల్పించారు. దీంతో ఇప్పటివరకు ఓటర్ల జాబితాలో పేరు లేకపోయిన అర్హులైన ఓటర్లు, తప్పుగా తొలగించినట్లు భావిస్తున్న వారు తమ వివరాలను తిరిగి నమోదు చేసుకునేందుకు అవకాశం లభించింది. అదే సమయంలో క్లెయిమ్స్, అభ్యంతరాలపై నోటీసుల జారీ, వాటి పరిష్కార ప్రక్రియ గడువును అక్టోబర్ 5 వరకు ఈసీ పొడిగించింది. జూలై 1, 2026ను ప్రామాణిక తేదీగా తీసుకుని రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సర్ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ప్రక్రియ పూర్తైన తర్వాత తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 9, 2026న ప్రచురించనున్నట్లు ఈసీ తెలిపింది. దీంతో అర్హులైన ఓటర్లు గడువులోగా తమ పేర్లను పరిశీలించుకోవడం, అవసరమైతే క్లెయిమ్ లేదా అభ్యంతరం దాఖలు చేయడం కీలకంగా మారింది.

# నీట్ నిరసనలపై కేసులకు సుప్రీం చెక్

- జెన్‌జీ ఆందోళనకారులకు కేసుల ఊరట
- ఆర్టికల్ 142తో కీలక తీర్పు



నీట్ యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరిగిన జెన్ జీ విద్యార్థుల నిరసనలకు సంబంధించి నమోదైన క్రిమినల్ కేసులను సుప్రీంకోర్టు సంచలన నిర్ణయంతో కొట్టివేసింది. కేంద్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు ఈ కేసులను మూసివేయాలని నిర్ణయించిన ధర్మాసనం.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద 'సంపూర్ణ న్యాయం' కోసం ప్రత్యేక అధికారాలను వినియోగించింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం.. ఈ ఎఫ్ఐఆర్‌లపై ఇక దర్యాప్తు కొనసాగించకూడదని, వాటిని అన్ని విధాలుగా మూసివేయాలని స్పష్టం చేసింది. ఢిల్లీకి మాత్రమే పరిమితం కాకుండా దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో జరిగిన సీజేపీ నేతృత్వ నిరసనలకు ఈ ఆదేశాలు వర్తిస్తాయని కోర్టు తేల్చింది. జూలై 20 నుంచి 25 వరకు జరిగిన ఆందోళనలకు సంబంధించి కొత్తగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయకుండా కేంద్రం చర్యలు తీసుకోవచ్చని తెలిపింది.

#### 2,873 మందికి మాత్రం మినహాయింపు

అయితే క్రిమినల్ నేపథ్యం ఉన్నట్లు గుర్తించిన 2,873 మందిపై కొత్తగా ప్రత్యేక ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు ఢిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. జంతర్‌మంతర్ వద్ద నిరసన సమయంలో ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ ద్వారా వీరిని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. అయితే కేసులు నమోదు చేసినా వారి హక్కులకు భంగం కలగకూడదని, తమ వాదన వినిపించుకునే పూర్తి అవకాశం కల్పించాలని కోర్టు స్పష్టం చేసింది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ తర్వాత ఆందోళనలకు దిగిన విద్యార్థులపై జూలై 20న పోలీసులు టియర్ గ్యాస్, పెల్లెట్ గన్స్ ఉపయోగించడంతో వివాదం ముదిరింది. నిరసనకారులపై అల్లర్లు, హత్యాయత్నం, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం వంటి ఆరోపణలతో కేసులు నమోదయ్యాయి. అనంతరం ఢిల్లీ పోలీసుల వైఖరిలో మార్పు వచ్చింది. సెప్టెంబర్ 5న సీజేపీ నిర్వహించనున్న మార్చ్ నేపథ్యంలో పోలీసులు ఎఫ్ఐఆర్‌లను కొనసాగించబోమని కోర్టుకు తెలిపారు. మహారాష్ట్ర, అసోం, బిహార్, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలు కూడా ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయాలని కోరాయి.

#### విద్యార్థుల భవిష్యత్తుపై కోర్టు దృష్టి

ఈ తీర్పులో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకున్నట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నిరసనల్లో పాల్గొన్న యువత భవిష్యత్ అవకాశాలకు ఆటంకం కలగకూడదన్న ఉద్దేశంతోనే ఆర్టికల్ 142ను వినియోగించినట్లు సీజేఐ సూర్యకాంత్ తెలిపారు. విద్యార్థులు పోటీ ప్రపంచంలో తమ కెరీర్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. నీట్ యూజీ ప్రశ్నపత్రం లీకేజీ తర్వాత ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం అందించేందుకు దేశవ్యాప్తంగా అమలు చేసే ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని కేంద్రాన్ని ఆదేశించారు. పరిహారం చెల్లింపులు మూడు నెలల్లో పూర్తిచేయాలని స్పష్టం చేశారు. తీర్పు అనంతరం CJP నేత సౌరవ్ దాస్ సెప్టెంబర్ 5న తలపెట్టిన మార్చ్‌ను విరమిస్తున్నట్లు ప్రకటించారు. కేంద్రం ఇచ్చిన హామీలకు సుప్రీంకోర్టు న్యాయబద్ధత కల్పించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

# ఏపీకి కరువు ముప్పు

- ఎల్‌నినోతో నీటి కొరత
- మంత్రి ఆనం హెచ్చరిక
- ఆరు నెలలు అప్రమత్త అవసరం



ఆంధ్రప్రదేశ్‌లో ఎల్‌నినో ప్రభావంతో తీవ్రమైన కరువు పరిస్థితులు వచ్చే ప్రమాదం ఉందని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి హెచ్చరించారు. నెల్లూరు జిల్లాలో పర్యటించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో నీటి పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి, కృష్ణా, పెన్నా నదుల్లో నీటి ప్రవాహాలు తగ్గిపోవడంతో జలాశయాలు ఎండిపోతున్నాయని తెలిపారు. ఇప్పటికే భూగర్భ జలమట్టాలు సుమారు మూడు మీటర్లు పడిపోయాయని, రానున్న రోజుల్లో పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందని చెప్పారు. రాబోయే ఆరు నెలలు నీటి వినియోగంపై ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే పంటలకు నీటి కొరతతో పాటు తాగునీటి సమస్య కూడా తీవ్రంగా మారే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

#### ధాన్యం ఇప్పుడే అమ్మొద్దు

కరువు ప్రభావం ఎదురయ్యే అవకాశాల నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. చేతికి వచ్చిన ధాన్యాన్ని కేవలం డబ్బుల అవసరం కోసం వెంటనే మొత్తం మార్కెట్‌లో విక్రయించవద్దని అన్నదాతలకు విజ్ఞప్తి చేశారు. వచ్చే ఏడాది జూన్, జులై వరకు కుటుంబ అవసరాలకు సరిపడేలా ధాన్యాన్ని కొంత మేర భద్రపరుచుకోవాలని సూచించారు. నీరు, ఆహార ధాన్యాల విషయంలో పొదుపు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు, రైతులు ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉంటే భవిష్యత్ ఇబ్బందులను కొంతవరకు ఎదుర్కోవచ్చని మంత్రి ఆనం స్పష్టం చేశారు. వర్షపాతం, నదుల ప్రవాహాలు, భూగర్భ జలాల పరిస్థితిని ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోందని తెలిపారు.



### ప్రజల గుండె చప్పుడు వైఎస్సార్
## నేటికి చెరగని రాజన్న సంక్షేమ ముద్ర

సెప్టెంబర్ 2న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి. వైఎస్సార్ పాలన కాలం ఐదేళ్లే అయినా, పేదల జీవితాలపై ఆయన వేసిన ముద్ర మాత్రం చిరస్థాయిగా నిలిచింది. ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు చేపట్టిన పాదయాత్రతో సామాన్యుడికి దగ్గరైన ఆయన.. అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇచ్చారు. రైతులు, పేదలు, మహిళలు, విద్యార్థులు, బలహీన వర్గాల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. పేదవాడి ముఖంలో చిరునవ్వే ప్రభుత్వ విజయానికి కొలమానం కావాలని భావించిన నాయకుడిగా వైఎస్సార్ గుర్తుండిపోయారు. రైతులకు ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇళ్ల నిర్మాణం, మహిళల స్వయం ఉపాధికి ప్రోత్సాహం వంటి కార్యక్రమాలు ఆయన పాలనలో ప్రత్యేక గుర్తింపు పొందాయి.

#### జలయజ్ఞం నుంచి ఆరోగ్యశ్రీ వరకు

రైతుల కోసం సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేసిన వైఎస్సార్ జలయజ్ఞాన్ని తన పాలనలో ప్రధాన కార్యక్రమంగా ముందుకు తీసుకెళ్లారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను కదిలించి కరువు ప్రాంతాలకు నీరు అందించేందుకు ప్రయత్నించారు. పేద కుటుంబాలకు ఖరీదైన వైద్యం భారంగా మారకూడదనే లక్ష్యంతో ప్రారంభించిన ఆరోగ్యశ్రీ లక్షలాది కుటుంబాలకు వైద్య భరోసాగా నిలిచింది. 2009 సెప్టెంబర్ 2న హెలికాప్టర్ ప్రమాదంలో వైఎస్సార్ మరణం తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఆయన భౌతికంగా దూరమైనా రైతు పొలంలో పారే నీటిలో, పేదవాడికి అందిన వైద్యంలో, విద్యార్థికి లభించిన చదువు అవకాశంలో ఆయన జ్ఞాపకం కనిపిస్తూనే ఉంది. అందుకే వైఎస్సార్ కేవలం ఒక రాజకీయ నాయకుడి పేరు కాదు.. పేదల సంక్షేమాన్ని గుర్తు చేసే పేరు, ప్రజల గుండెల్లో నిలిచిపోయిన ఓ జ్ఞాపకం.

## పిఠాపురం అభివృద్ధికి రూ.308 కోట్ల మెగా ప్లాన్



ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో పిఠాపురం పట్టణ అభివృద్ధికి రూ.308.24 కోట్ల విలువైన పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. ప్రజల చిరకాల సమస్య అయిన భూగర్భ డ్రైనేజీ కోసం రూ.200 కోట్లతో 120 కిలోమీటర్ల పైప్‌లైన్లు ఏర్పాటు చేయనున్నారు. తాగునీటి సరఫరా మెరుగుదలకు రూ.59.52 కోట్లతో కొత్త పైప్‌లైన్లు, నీటి ట్యాంకులు నిర్మిస్తున్నారు. ఏలేశ్వరం నుంచి రోజుకు 55 లక్షల లీటర్ల నీటిని పిఠాపురానికి తరలించేందుకు ప్రధాన పైప్‌లైన్ పనులు సాగుతున్నాయి. దాదాపు 5 వేల కొత్త తాగునీటి కనెక్షన్లు ఇవ్వనున్నారు. వ్యర్థాల నిర్వహణకు రూ.4 కోట్లతో తడి చెత్త ప్లాంట్, రూ.1.43 కోట్లతో మల వ్యర్థాల శుద్ధి కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. రూ.21.82 కోట్లతో రెండు మురుగునీటి శుద్ధి కేంద్రాలు నిర్మిస్తున్నారు. రహదారులు, కాలువలు, చిన్న వంతెనలు, పార్కులు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పనులకు కూడా నిధులు కేటాయించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే పిఠాపురం పట్టణ రూపురేఖలు మారనున్నాయి.

# ఒంటిమిట్ట ఎస్ఐ అరాచకం

- విచక్షణా రహితంగా బాదుడు
- ఆందోళనకు దిగిన బాధితులు



ఒంటిమిట్ట: ఒంటిమిట్ట సబ్ఇన్‌స్పెక్టర్‌పై బాధితులు తీవ్ర ఆరోపణలు చేశారు. కేసు విషయంలో ఓ బాధితుడిని విచక్షణా రహితంగా కొట్టారని, ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన బాధితులతోనూ కఠినంగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. ఒక కేసు విషయంలో బాధితుడిని తీవ్రంగా కొట్టడంతో ఒంటిపై రక్తపు వాతలు పడేలా గాయాలయ్యాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను రక్షించాల్సిన పోలీసులే ఇలా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించినప్పటికీ ఎస్ఐ వ్యవహార శైలి తమకు తీవ్ర ఇబ్బందికరంగా ఉందని బాధితులు పేర్కొన్నారు. విచక్షణ లేకుండా నిర్ణయాలు తీసుకోవడం వల్ల సామాన్య ప్రజలు పోలీసులను ఆశ్రయించేందుకు భయపడే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై త్వరలో మీడియా సమావేశం నిర్వహించి తమకు జరిగిన అన్యాయాన్ని, ఎస్ఐ వ్యవహరించిన తీరును ప్రజల ముందుకు తీసుకురానున్నట్లు బాధితులు తెలిపారు. ఇలాంటి ఘటనలపై ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు. అయితే, బాధితులు చేసిన ఆరోపణలపై పోలీసుల వివరణ వెలువడాల్సి ఉంది.

# ఏపీ ఖజానాకు పన్నుల జోష్

- ఆగస్టులో 18 శాతం భారీ వృద్ధి



ఆంధ్రప్రదేశ్ పన్నుల ఆదాయంలో గణనీయమైన వృద్ధి నమోదైంది. ఈ ఏడాది ఆగస్టులో రాష్ట్ర పన్నుల రాబడి 18.05 శాతం పెరిగి రూ.25,449.80 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే నెలలో రూ.21,558.09 కోట్లుగా ఉన్న పన్నుల ఆదాయంతో పోలిస్తే ఈసారి రూ.485.41 కోట్ల అదనపు రాబడి సమకూరినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. పన్నుల వసూళ్లతో పాటు నికర ఆదాయంలోనూ దాదాపు 18 శాతం వృద్ధి నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ పెరుగుదల రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి మరింత బలాన్ని చేకూర్చే అంశంగా ప్రభుత్వం భావిస్తోంది. పన్నుల వసూళ్లు మెరుగుపడటం ద్వారా ప్రభుత్వ ఆదాయ వనరులు బలోపేతం అవుతున్నాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

#### ఏఐతో పన్ను ఎగవేతలకు చెక్

పన్నుల రాబడి పెరగడానికి వాణిజ్య పన్నుల శాఖలో చేపట్టిన సాంకేతిక సంస్కరణలు, ఆధునిక విధానాలు కీలకంగా మారుతున్నాయని ప్రభుత్వం చెబుతోంది. ముఖ్యంగా పన్ను ఎగవేతలను గుర్తించేందుకు, అనుమానాస్పద లావాదేవీలను పరిశీలించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత స్క్రూటినీ విధానాన్ని ప్రవేశపెట్టారు. దీంతో పన్ను చెల్లింపుల్లో లోపాలు, అక్రమ లావాదేవీలను గుర్తించే సామర్థ్యం పెరిగిందని అధికారులు చెబుతున్నారు. సాంకేతికతను వినియోగిస్తూ పన్ను వసూళ్లను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా పెంచడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. తాజాగా నమోదైన 18.05 శాతం వృద్ధి ఈ విధానాల ఫలితాలను సూచిస్తోందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.

### సమాచార శాఖ అదనపు డైరెక్టర్‌గా
# డి.ఎస్. జగన్



హైదరాబాద్‌లో సమాచార, పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకుడిగా డి.ఎస్. జగన్ పదోన్నతి పొంది బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన అనంతరం ఆయన కొత్త బాధ్యతల్లోకి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి జగన్‌ను అభినందించి, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు సమర్థవంతంగా చేరవేయాలని సూచించారు. ప్రభుత్వం, ప్రజలు, మీడియా మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. అనంతరం శాఖ స్పెషల్ కమిషనర్ డా. జి. ముకుందరెడ్డిని కూడా జగన్ కలిశారు. తనపై ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తానని జగన్ తెలిపారు. శాఖ అధికారులతో సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ విధానాలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శాఖ అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# బీసీల గర్జన.. యూనిక్ కోడ్‌కై డిమాండ్

## కులగణనలో కోడ్ లేకపోతే లెక్కే తప్పు!

### ఢిల్లీలో చిరంజీవులు ఆధ్వర్యంలో గర్జన

కులం కేవలం ఒక గుర్తింపు కాదు.. అవకాశాలు, అభివృద్ధి, సామాజిక న్యాయానికి సంబంధించిన కీలక అంశం. దేశంలో బీసీల జనాభా ఎంత? ఏ కులానికి ఎంత ప్రాతినిధ్యం ఉంది? ప్రభుత్వ పథకాలు ఎవరికి ఎంత చేరుతున్నాయి? అన్న ప్రశ్నలకు ఖచ్చితమైన సమాధానం రావాలంటే కులగణన శాస్త్రీయంగా జరగాలి. పేర్లు మారితే, ఉపకులాలు కలిస్తే, ఒకే కులానికి భిన్న గుర్తింపులు ఉంటే లెక్కల్లో గందరగోళం తప్పదు. అందుకే ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించాలన్న డిమాండ్ ఇప్పుడు కీలకంగా మారింది. బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టి. చిరంజీవులు ఆధ్వర్యంలో ఢిల్లీలో వినిపించిన ఈ డిమాండ్ కేవలం లెక్కల కోసం కాదు.. కచ్చితమైన డేటా ఆధారంగా సామాజిక న్యాయం సాధించాలన్న బీసీల గర్జనగా మారింది.

**పోరాటానికి చిరంజీవులు నేతృత్వం**

సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్న వివిధ సంస్థలు, బీసీ సంఘాలు, మేధావులు, సామాజిక కార్యకర్తలు ఒకే వేదికపైకి వచ్చి కులగణనపై కీలక డిమాండ్లను ముందుకు తెచ్చారు. "కులగణన కావాలి" అనే సాధారణ డిమాండ్‌ను దాటి.. "ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్‌తో శాస్త్రీయ కులగణన కావాలి" అనే స్పష్టమైన నినాదాన్ని సమావేశం దేశం ముందు ఉంచింది. జనాభా సంఖ్యలు కచ్చితంగా నమోదు కాకపోతే సామాజిక న్యాయ విధానాలకు సరైన పునాది ఉండదన్న అభిప్రాయం వ్యక్తమైంది. విద్య, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు, రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక అవకాశాలు, ప్రభుత్వ వనరుల పంపిణీ వంటి అంశాలకు కులగణన డేటా కీలకంగా మారే పరిస్థితిలో లెక్కల్లో చిన్న పొరపాటు కూడా భవిష్యత్ విధానాలపై పెద్ద ప్రభావం చూపే అవకాశం ఉందని సమావేశం స్పష్టం చేసింది. ఇది కేవలం ఒక సమావేశం కాదు.. బీసీల హక్కుల కోసం దేశవ్యాప్త ఉద్యమానికి నాంది అనే సంకేతాన్ని ఢిల్లీ వేదిక నుంచి ఇచ్చింది.

**చిరంజీవుల నాయకత్వంలో ఉద్యమానికి కొత్త దిశ**

బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టి. చిరంజీవులు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశం కులగణనను కేవలం జనాభా లెక్కల అంశంగా కాకుండా సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, వనరుల న్యాయమైన పంపిణీకి పునాదిగా చూడాలన్న సందేశాన్ని ఇచ్చింది. సరైన డేటా లేకుండా సరైన విధానాలు రూపొందించడం సాధ్యం కాదన్న వాదనను బలంగా ముందుకు తెచ్చింది. కేంద్ర ప్రభుత్వ దృష్టికి యూనిక్ కోడ్ డిమాండ్‌ను తీసుకెళ్లడంతో పాటు దేశవ్యాప్తంగా సామాజిక న్యాయ సంస్థలను ఒకే వేదికపైకి తీసుకురావాలన్న లక్ష్యాన్ని సమావేశం నిర్దేశించింది. ప్రతి కులానికి ప్రత్యేక కోడ్.. ప్రతి వర్గానికి స్పష్టమైన లెక్క.. లెక్కల ఆధారంగా న్యాయం అన్నదే ఈ ఉద్యమం ప్రధాన సారాంశంగా మారింది.ఒ జనాభా సంఖ్యకు అనుగుణంగా విధానాలు రూపొందించాలంటే ముందుగా ఆ జనాభా ఎవరు, వారి సంఖ్య ఎంత, ఏ ప్రాంతంలో ఎంతమంది ఉన్నారు అన్న వివరాలు ఖచ్చితంగా తెలియాలి. అందుకు శాస్త్రీయ కులగణన అవసరం. కులగణనలో పొరపాటు జరిగితే దాని ప్రభావం సంక్షేమం నుంచి



అవకాశాల వరకు విస్తరించే అవకాశం ఉంది. అందుకే యూనిక్ కోడ్ డిమాండ్‌ను బీసీల భవిష్యత్ హక్కుల పోరాటంలో కీలక అంశంగా మార్చాలని సమావేశం సంకల్పించింది. చిరంజీవుల నాయకత్వంలో ఢిల్లీలో వినిపించిన ఈ గర్జన రాష్ట్రాల సరిహద్దులు దాటి జాతీయ స్థాయిలో బలపడితే కులగణనపై మరింత విస్తృత చర్చకు దారి తీసే అవకాశం ఉంది. "ప్రతి కులానికి యూనిక్ కోడ్".. "ఏకాభిప్రాయం తర్వాతే శాస్త్రీయ కులగణన" అనే డిమాండ్లతో ప్రారంభమైన ఈ ఉద్యమం ఇకపై ఏ దిశగా దూసుకెళ్తుందన్నదే ఆసక్తికరంగా మారింది.

**కోడ్ లేకుంటే కులగణనలో గందరగోళం**

కులగణనలో ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించాలి అన్న డిమాండ్ కీలకంగా మారింది. వేలాది కులాలు, ఉపకులాలు ఉండటంతో ఒకే కులానికి ప్రాంతాలవారీగా భిన్న పేర్లు, పర్యాయ పదాలు ఉండటం, ఒకే పేరు వేర్వేరు సామాజిక వర్గాలకు వినియోగించే అవకాశం ఉందని సమావేశం పేర్కొంది. కేవలం పేర్ల ఆధారంగా లెక్కలు తీస్తే డేటా వర్గీకరణ, విశ్లేషణలో తప్పులు జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఎస్సీలు, ఎస్టీలకు ఉన్న గుర్తింపు విధానం తరహాలో ప్రతి కులానికి ప్రత్యేక కోడ్ ఉంటే పేర్ల భిన్నత్వం తొలగి శాస్త్రీయంగా కులాల వారీ లెక్కలు రూపొందించవచ్చని అభిప్రాయపడింది. ఏకాభిప్రాయం లేకుండా జనగణన నిర్వహించకూడదని డిమాండ్ చేస్తూ, కులాల నమోదు, కోడింగ్, డేటా ధ్రువీకరణపై నిపుణులు, కుల సంఘాలలతో చర్చ జరపాలని కోరింది.



## కులగణనపై కీలక డిమాండ్, ప్రత్యేక కోడ్‌లు కేటాయించాకే లెక్కలు

**రిజిస్ట్రార్ జనరల్ సెన్సస్ కమిషనర్ కార్యాలయానికి వినతిపత్రం**

కులగణనలో ప్రతి కులానికి ప్రత్యేక గుర్తింపు కోడ్ కేటాయించిన తర్వాతే ప్రక్రియను కొనసాగించాలని సమన్వయ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కమిటీ తరఫున చిరంజీవులు, వి. శ్రీనివాస్ గౌడ్, బాలగోని బాలరాజ్, డా. జి. కిరణ్ కుమార్ న్యూఢిల్లీలోని రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ కార్యాలయానికి వినతిపత్రం సమర్పించారు. కులాల గణనకు సంబంధించి నిన్న జరిగిన సమావేశంలో వక్తలు సంతకం చేసిన తీర్మానాన్ని కూడా వినతిపత్రంతో పాటు అధికారులకు అందజేశారు. ప్రతి కులానికి ప్రత్యేకమైన యూనిక్ కోడ్ కేటాయించే వరకు జనగణన ప్రక్రియను నిలిపివేయాలని కమిటీ స్పష్టం చేసింది. కులాల వివరాలను నమోదు చేసే విధానం, వర్గీకరణ, గుర్తింపు విషయంలో స్పష్టత లేకుండా గణన కొనసాగితే భవిష్యత్తులో లెక్కల్లో తప్పులు జరిగే అవకాశం ఉందని వారు అభిప్రాయపడ్డారు. అందువల్ల అన్ని వర్గాలతో చర్చించి, కులగణనకు సరైన శాస్త్రీయ విధానంపై ఏకాభిప్రాయం సాధించిన తర్వాతే ప్రక్రియను తిరిగి ప్రారంభించాలని కోరారు. ప్రతి కులానికి ప్రత్యేక కోడ్ ఉండటం వల్ల గణాంకాల్లో స్పష్టత, పారదర్శకత పెరుగుతుందని కమిటీ ప్రతినిధులు తెలిపారు. సామాజిక, ఆర్థిక విధానాల రూపకల్పనకు కులాలపై ఖచ్చితమైన గణాంకాలు అవసరమని పేర్కొంటూ తమ డిమాండ్‌ను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

## గంగమ్మ గుడి స్థలంపై వివాదాలు వద్దు



ఒంటిమిట్టలో శ్రీ గంగమ్మ దేవత ఆలయ నిర్మాణానికి గ్రామసభ ఏకగ్రీవంగా కేటాయించిన స్థలాన్ని అమలు చేయాలని మాజీ సర్పంచ్, మండల సీనియర్ నాయకుడు కొమర వెంకట నరసయ్య కోరారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2004లో అప్పటి ఎమ్మెల్యే, మాజీ మంత్రి స్వర్గీయ పసుపులేటి బ్రహ్మయ్య హాజరైన గ్రామసభలో గంగమ్మ ఆలయానికి గ్రామ కంఠం భూమిలో ఐదు సెంట్లు కేటాయిస్తూ తీర్మానం చేసినట్లు తెలిపారు. 2014లోనూ ఇదే అంశంపై గ్రామసభ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కేటాయించిన స్థలంలో అక్రమ నిర్మాణాలు జరిగితే గ్రామస్తులు అడ్డుకున్నారని వివరించారు. ఆలయ నిర్మాణానికి అడ్డంకులపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఫిర్యాదు చేయగా, ఆయన ఆదేశాలతో ఎమ్మార్వో, ఎంపీడీవో, పంచాయతీరాజ్ ఏఈలతో కూడిన కమిటీ పరిశీలించి ఎలాంటి అడ్డంకులు లేవని నివేదిక ఇచ్చిందన్నారు. జిల్లా కలెక్టర్ ఆ నివేదికను వెంటనే ఆమోదించి ఆలయ నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని కోరారు. ఎన్నికల నేపథ్యంలో సమస్యను రాజకీయంగా మార్చకుండా గ్రామసభ తీర్మానాన్ని గౌరవించాలని విజ్ఞప్తి చేశారు.



## కాంగ్రెస్ కార్యాలయాన్ని ముట్టడించిన బీజేపీ

హైదరాబాద్‌లోని తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడికి నిరసనగా వనపర్తి జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ముట్టడించారు. జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో కాంగ్రెస్ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజకీయంగా ఎదుర్కోలేక భౌతిక దాడులకు దిగడం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని బీజేపీ నేతలు విమర్శించారు. శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసులు, ఇంటెలిజెన్స్ వ్యవస్థ విఫలమయ్యాయని ఆరోపించారు. కాంగ్రెస్ కార్యాలయం వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం అన్యాయమని నారాయణ మండిపడ్డారు. అధికార పార్టీకి అనుకూలంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ, ప్రతిపక్షాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, కల్పన, నక్క మహేష్ పాల్గొన్నారు.

## 5 వేల ఆలయాలకు చంద్రబాబు మెగా ప్లాన్



రాష్ట్రవ్యాప్తంగా 5 వేల దేవాలయాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సీఎం చంద్రబాబు టీటీడీ, దేవాదాయశాఖ అధికారులను ఆదేశించారు. అమరావతిలో నిర్వహించిన సమీక్షలో ఆలయాలకు స్థలాలు త్వరగా ఖరారు చేసి పనులు ప్రారంభించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలు, మత్స్యకార ప్రాంతాలు, బలహీన వర్గాల ప్రాంతాల్లో ఆలయ నిర్మాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. ఇప్పటికే 967 ఆలయాల నిర్మాణం పూర్తయిందని, మరో 4,192 ఆలయాలకు ప్రతిపాదనలు వచ్చాయని అధికారులు వివరించారు. రాష్ట్రంలోని వెయ్యి పురాతన ఆలయాలను పునరుద్ధరించాలని, శివాలయాలు, శక్తిపీఠాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. ఆలయాల వివరాలను డిజిటలైజ్ చేయడంతో పాటు అర్చకులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. టీటీడీ విద్య, వైద్య సేవలను విస్తరించాలని, నిపుణులైన వైద్యులను శ్రీవారి సేవకులుగా వినియోగించుకోవాలని చెప్పారు. 33 విద్యాసంస్థలు, ఆస్పత్రుల సేవలను మరింత సమర్థంగా తీర్చిదిద్దాలని సూచించారు. తిరుపతిని సంపూర్ణ దివ్యక్షేత్రంగా అభివృద్ధి చేసి, అమరావతి శ్రీవారి ఆలయ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని చంద్రబాబు ఆదేశించారు.

## చంద్రన్న పంపారు.. మీ ఇంటికే పింఛన్



చీరాల నియోజకవర్గంలో ఇంటింటికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ మంగళవారం తెల్లవారుజామునే ఉత్సాహంగా ప్రారంభమైంది. మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు రాంనగర్ రంగారావు కాలనీలో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందించారు. ఈ సందర్భంగా "చంద్రన్న మీ ఇంటికి నన్ను పంపారు.. ప్రతి అవ్వాతాత ముఖంలో చిరునవ్వు చూడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతినెల ఒకటో తేదీ తెల్లవారుజామునే లబ్ధిదారుల ఇంటికే పింఛన్ అందిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం సహకారంతో చీరాల నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. అన్ని ప్రాంతాలు, గ్రామాల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందన్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్, ఆప్కో చైర్మన్ సజ్జ హేమలత, పట్టణ మహిళా అధ్యక్షురాలు దర్శి నాగేంద్రమణి తదితరులు పాల్గొన్నారు.



## జనసేన యువజన విభాగం ఆవిష్కరణ

పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 2న జనసేన యువజన విభాగాన్ని పండుగ వాతావరణంలో ఆవిష్కరిస్తున్నట్లు రాష్ట్ర మంత్రి, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. పిఠాపురంలో ఏర్పాట్లను పరిశీలించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాజకీయాల్లో మార్పు, వచ్చేతరం ఆలోచనలను సమాజానికి అందించడమే యువజన విభాగం లక్ష్యమన్నారు. 'దేశమే ఫస్ట్' నినాదంతో బాధ్యతాయుతమైన యువతను రాజకీయాల్లోకి తీసుకురావాలని పవన్ కళ్యాణ్ ఆశయమని చెప్పారు. రాష్ట్రంలోని 25 పార్లమెంట్, 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పోలీసుల అనుమతితో బైక్ ర్యాలీలు చేపడతామని తెలిపారు. పిఠాపురం వేదికగా ప్రత్యేక గీతం, లోగో, ఏవీ ఆవిష్కరిస్తామని చెప్పారు. 175 నియోజకవర్గాల్లో ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత, మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. యువతను పార్టీ నిర్మాణంలో



## నాగర్‌కర్నూల్‌లో తల్పునూర్‌ను కలపాలి

తమ గ్రామాన్ని వనపర్తి జిల్లా నుంచి నాగర్‌కర్నూల్‌లో విలీనం చేయాలంటూ తల్పునూర్ గ్రామస్థులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 78వ రోజుకు చేరుకున్నాయి. అఖిలపక్ష జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆందోళనలో గ్రామస్థులు మాట్లాడుతూ, నాగంకర్నూల్ కేవలం 14 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో విద్య, వైద్యం, వ్యవసాయ అవసరాల కోసం అక్కడికే వెళ్తున్నామని తెలిపారు. వనపర్తి జిల్లా కేంద్రం 30 కిలోమీటర్ల దూరంలో ఉండటం, రవాణా సౌకర్యాలు సరిగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోనే ఉన్న తల్పునూర్‌ను తిరిగి అదే జిల్లాలో చేర్చాలని డిమాండ్ చేశారు. పరిపాలనా సౌలభ్యం, ప్రజల రాకపోకలు, అత్యవసర సేవలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలని కోరారు. గ్రామ ప్రజల డిమాండ్‌ను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అఖిలపక్ష నాయకులు విజ్ఞప్తి చేశారు.



## దళిత భూమి ఆక్రమణపై ఎమ్మెల్యే రాజీనామా

దళితుల లావణి పట్టా భూమిని అక్రమంగా దక్కించుకున్నారన్న ఆరోపణలపై వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి రాజీనామా చేయాలని, ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, దొడ్ల రాములు, జాత్రు నాయక్ మాట్లాడుతూ, వెలుటూరు శివారులోని సర్వే నంబర్ 517/ఆ2లో 0.39 గుంటల నిషేధిత లావణి భూమిని అధికారులపై ఒత్తిడి తెచ్చి తన పేరుపై మార్చించుకున్నారని ఆరోపించారు. ఎన్నికల అఫిడవిట్‌లోనూ భూమిని పట్టాగా చూపి నిబంధనలు ఉల్లంఘించారని విమర్శించారు. దోడగుంటపల్లి--అంకూరు మధ్య సోలార్ ప్లాంట్ కోసం దళితులకు చెందిన 5 ఎకరాల 10 గుంటల భూమిని దారిమళ్లించి కమిషన్లు తీసుకున్నారని ఆరోపించారు.

## దేవరకద్రలో కాలువల సామర్థ్యం పెంపు

సాగునీటి వనరులను సద్వినియోగం చేసి రైతులకు మరింత నీరందించడమే లక్ష్యంగా కాలువల సామర్థ్యాన్ని పెంచుతున్నట్లు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి తెలిపారు. మంగళవారం మంగనూర్ వద్ద కేఎల్ఐ మెయిన్ కెనాల్ నుంచి డిస్ట్రిబ్యూటరీ ఐ8, ఐ12, ఐ13 కాలువలను అధికారులు, రైతులతో కలిసి పరిశీలించారు. అడ్డాకుల, మూసాపేట్, భూత్పూర్ మండలాల్లోని గొలుసుకట్టు చెరువులకు నీటిని అందించేందుకు కొత్త కాలువల ఏర్పాటుపై చర్చించారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల సామర్థ్యాన్ని పెంచి మొత్తం 7,500 ఎకరాలకు సాగునీరు అందేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.



## పేదల ఇంటి ముంగిటకే పింఛన్

ప్రొద్దుటూరు పట్టణంలో 14,094 మంది లబ్ధిదారులకు ప్రతినెలా రూ.6.21 కోట్ల పింఛన్ పంపిణీ చేస్తున్నట్లు పురపాలక సంఘం కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం 6వ వార్డు సచివాలయం పరిధిలోని డ్రైవర్ కొట్టాల ప్రాంతంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీని ఆయన తనిఖీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్న కమిషనర్, ఇంటి వద్దే పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలని, పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. దివ్యాంగులు, డప్పు కళాకారులు, మత్స్యకారులు, తలసేమియా బాధితులు, గీత, చేనేత కార్మికులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వృద్ధులు, కిడ్నీ, లివర్ వ్యాధిగ్రస్తులు తదితరులకు 20 రకాల సామాజిక భద్రత పింఛన్లు అందుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం దివ్యాంగులు మహబూబ్, సుబ్బారాయుడికి స్వయంగా పింఛన్ నగదు అందించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

## 2029లో ఇండిపెండెంట్‌గా పోటీ చేద్దాం!



ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సవాల్‌కు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ప్రతిసవాల్ విసిరారు. 2029 ఎన్నికల్లో తాను ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని, వరదరాజులరెడ్డి కూడా స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి వచ్చి తనను ఓడించాలని అన్నారు. మంగళవారం తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ, తనపై వరదరాజులరెడ్డి చేసిన విమర్శలను ఖండించారు. తాను బీసీలను అవమానించలేదని, వ్యక్తిగత ఆరోపణలు చేసిన వ్యక్తినే ఉద్దేశించి వ్యాఖ్యలు చేశానని స్పష్టం చేశారు. బీసీల పేరుతో రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. వైసీపీ అధినేత జగన్, పార్టీ కార్యకర్తలే తన రాజకీయ బలమని అంగీకరించిన రాచమల్లు, పార్టీ టికెట్ వచ్చినా రాకపోయినా తన పోరాటం కొనసాగుతుందని చెప్పారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఛైర్మన్ పదవి ఓసీ జనరల్‌కు వస్తే తన కుమారుడు రాఘవేంద్రరెడ్డిని ఇండిపెండెంట్‌గా పోటీ చేయిస్తానని, వరదరాజులరెడ్డి తన కుమారుడిని బరిలోకి దించాలని సవాల్ చేశారు.

## మట్కాపై ప్రొద్దుటూరు పోలీసుల మెరుపుదాడి

ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీసులు మట్కా నిర్వహిస్తున్న నలుగురు బీటర్లను అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు మంగళవారం మధ్యాహ్నం ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో వన్‌టౌన్ ఎస్ఐ జి. మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడి నిర్వహించారు. మట్కా రాస్తున్నట్లు గుర్తించిన నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.9 వేల నగదు, నాలుగు మట్కా స్లిప్పులను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో పెన్నానగర్‌కు చెందిన షేక్ ఖాదిర్ (31), దేవరగుంట్ల దస్తగిరి (39), దూదేకుల దస్తగిరి (25), కాకర్ల దస్తగిరి (33) ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి ప్రజలకు సూచించారు. ఇలాంటి కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

## మైనర్ల బైక్ రైడింగ్‌పై పోలీసుల కొరడా



ప్రొద్దుటూరులో మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపకుండా పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. మంగళవారం సాయంత్రం గాంధీ రోడ్డులో వన్‌టౌన్ ఎస్సై మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో 5 నుంచి 7 గంటల వరకు తనిఖీలు నిర్వహించారు. మైనర్ డ్రైవింగ్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, అధిక సీసీ సామర్థ్యం ఉన్న బైక్‌లు నడపడం వంటి ఉల్లంఘనలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ తనిఖీల్లో 15 మంది మైనర్లు వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి, వారి తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. మైనర్లు బైక్‌లు నడపడం వల్ల జరిగే ప్రమాదాలు, ఎదురయ్యే చట్టపరమైన సమస్యలపై తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలకు సంబంధించి రూ.13,245 జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి రోడ్లపైకి పంపొద్దని తల్లిదండ్రులకు సూచించారు.



## పబ్లిక్ పల్స్... పొలిటికల్ సెన్స్

## జనాభా లెక్కలు.. రాజకీయ లెక్కలు!

## దేశంలో ప్రజాస్వామ్యానికి కొత్త సవాళ్లు

# పాపులేషన్ పాలిట్రిక్స్



**జనాభా మార్పులు ఇక కేవలం గణాంకాల అంశం కాదు. అవి నేరుగా రాజకీయ అధికారంపై, ఎన్నికల స్వరూపంపై, ప్రభుత్వ విధానాలపై, రాష్ట్రాల మధ్య సంబంధాలపై ప్రభావం చూపే కీలక అంశంగా మారుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా జననాలు తగ్గడం, మరణాల రేటులో మార్పులు, ప్రజల ఆయుర్దాయం పెరగడం, వలసలు పెరగడం వంటి పరిణామాలు రాజకీయ వ్యవస్థలను కొత్త ప్రశ్నల ముందుంచుతున్నాయి. భారతదేశంలో జరుగుతున్న జనగణన-2027 ప్రక్రియ ఈ చర్చకు మరింత ప్రాధాన్యం తెచ్చింది. 2026 తర్వాత జరిగే తొలి జనగణన ఆధారంగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉండటంతో జనాభా రాజకీయాలపై ఆసక్తి మరింత పెరిగింది. ఒక ప్రాంతంలో జనాభా వేగంగా పెరుగుతుంటే మరో ప్రాంతంలో జనాభా వృద్ధి మందగించడం, వృద్ధుల సంఖ్య పెరగడం, యువత అధికంగా ఉండే రాష్ట్రాలు కొనసాగడం వంటి భిన్న పరిస్థితులు భవిష్యత్ రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేయవచ్చు. జనాభా పరిమాణం రాజకీయ శక్తికి కొలమానంగా మారే అవకాశం ఉన్న సమయంలో ప్రజా ప్రాతినిధ్యం ఎలా ఉండాలన్న ప్రశ్న అత్యంత కీలకం. ఈ నేపథ్యంలో జనాభా మార్పులను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం కంటే వాటి ప్రభావాలను శాస్త్రీయంగా అర్థం చేసుకుని ప్రజాస్వామ్య వ్యవస్థకు అనుగుణంగా పరిష్కారాలు రూపొందించాల్సిన అవసరం ఉంది. జనాభా అంశంపై భయాలు, అపోహలు, కుట్ర సిద్ధాంతాలు పెరగకుండా వాస్తవాలను ఆధారంగా చేసుకుని చర్చ జరగాలి. ఇదే రాజకీయ జనాభా శాస్త్రం ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది.**

### • ఎక్కువ పిల్లల పిలుపు ఎందుకు?

ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో జననాల రేటు తగ్గుతుండటంతో జనాభా పెరుగుదలపై ఆందోళన వ్యక్తమవుతోంది. టెక్నాలజీ రంగ ప్రముఖుడు ఎలాన్ మస్క్ నుంచి భారతదేశంలోని పలువురు రాజకీయ, సామాజిక, మత నాయకుల వరకు కొందరు ఎక్కువ మంది పిల్లలను కనాలని ప్రజలకు పిలుపునిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుగు కుటుంబాలు ఎక్కువ మంది పిల్లలను కనాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ జనాభా తగ్గుదల, నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో పెద్ద కుటుంబాల అవసరాన్ని ప్రస్తావిస్తూ "16 మంది పిల్లలు" అనే మాటను రాజకీయ వ్యాఖ్యగా ఉపయోగించారు. ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ హిందూ కుటుంబాల్లో ముగ్గురు పిల్లలు ఉండాలని సూచించారు. కేరళలో కాథలిక్ చర్చి కూడా పెద్ద కుటుంబాలను ప్రోత్సహించే అభిప్రాయాలను వ్యక్తం చేస్తోంది. తమిళనాడులో ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వం మూడో బిడ్డకు సంబంధించి మహిళా ప్రభుత్వ ఉద్యోగులకు ఏడాది ప్రసూతి సెలవు పొడిగించే నిర్ణయం తీసుకుంది. ఈ పరిణామాలన్నీ జనాభా అంశం ఇప్పుడు ఎన్నికల రాజకీయాల పరిధిని దాటి పాలనా విధానాల కేంద్రంగా మారుతోందని సూచిస్తున్నాయి. అయితే ఎక్కువ పిల్లలు కనాలని చెప్పడం మాత్రమే జనాభా సమస్యకు పరిష్కారం కాదన్న విషయాన్ని గుర్తించాలి. కుటుంబ పరిమాణాన్ని నిర్ణయించేది కేవలం ప్రభుత్వ ప్రోత్సాహకాలు కాదు. ఉద్యోగ అవకాశాలు, ఇళ్ల ఖర్చులు, పిల్లల విద్య, వైద్యం, మహిళల ఉపాధి, కుటుంబ ఆదాయం, జీవన ప్రమాణాలు, భవిష్యత్తుపై నమ్మకం వంటి అనేక అంశాలు కుటుంబ నిర్ణయాలను ప్రభావితం చేస్తాయి. అందుకే నాటలిజం లేదా అధిక జననాలను ప్రోత్సహించే రాజకీయ నినాదాలు సంక్లిష్టమైన సామాజిక వాస్తవాలకు సరళమైన సమాధానాలుగా మారకూడదు.

### • దేశంలో మారుతోన్న జననాల రేటు

భారతదేశ జనాభా పరిస్థితిని పరిశీలిస్తే ఒక ముఖ్యమైన మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. దేశంలో మొత్తం సంతానోత్పత్తి రేటు ప్రత్యామ్నాయ స్థాయి కంటే దిగువకు చేరింది. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే5 ప్రకారం దేశ సంతానోత్పత్తి రేటు సుమారు 2.0 పిల్లలు ప్రతి మహిళకు చేరింది. ముఖ్యంగా అన్ని ప్రధాన మత సమూహాల్లోనూ సంతానోత్పత్తి తగ్గింది. తగ్గుదల వేగంలో ప్రాంతాల మధ్య, సామాజిక వర్గాల మధ్య తేడాలు ఉన్నప్పటికీ మతాల మధ్య ఉన్న సంతానోత్పత్తి అంతరం కూడా క్రమంగా తగ్గుతోంది. ప్యూ రీసెర్చ్ విశ్లేషణ ప్రకారం ముస్లిం మహిళల సంతానోత్పత్తి రేటు 1992లో 4.4 నుంచి 2019 21 కాలంలో 2.4కి పడిపోయింది. అంటే జనాభా మార్పులను ఒకే మతం లేదా ఒకే సమాజంతో అనుసంధానం చేయడం వాస్తవ పరిస్థితిని పూర్తిగా ప్రతిబింబించదు. జనాభా మార్పు అనేది దీర్ఘకాలిక సామాజిక పరివర్తన ఫలితం. విద్య పెరగడం, మహిళల ఉపాధి విస్తరించడం, పట్టణీకరణ, కుటుంబ నిర్వహణపై అవగాహన, పిల్లల పెంపకం ఖర్చులు, జీవన ప్రమాణాలపై మారుతున్న అంచనాలు వంటి అంశాలు దీనిపై ప్రభావం చూపుతున్నాయి. మరోవైపు కొన్ని రాష్ట్రాలు వేగంగా వృద్ధాప్య దశకు చేరుకుంటున్నాయి. కేరళలో 2026 నాటికి మధ్య వయస్సు సుమారు 37 సంవత్సరాలుగా అంచనా వేయబడుతోంది. 2051 నాటికి అది 47 సంవత్సరాలకు చేరే అవకాశం ఉంది. ఉత్తరప్రదేశ్‌లో మధ్య వయస్సు సుమారు 26.9 సంవత్సరాలు. 2036 నాటికి కూడా అది దాదాపు 31.7 సంవత్సరాల వద్ద ఉండే అవకాశం ఉంది. భారతదేశ సగటు మధ్య వయస్సు 2026లో సుమారు 29.2 సంవత్సరాలు. ఒకే దేశంలో వృద్ధ రాష్ట్రాలు, యువ రాష్ట్రాలు ఒకేసారి ఉండటం భవిష్యత్ రాజకీయాలకు అతి పెద్ద సవాలు.

### • జనాభా మారితే ఎన్నికల సమీకరణాలూ మారతాయ్!

భారత ప్రజాస్వామ్యంలో "ఒక్క వ్యక్తికి ఒక్క ఓటు, ఒక్కో ఓటుకు సమాన విలువ" అనే సూత్రం ప్రాథమికమైనదే అయినప్పటికీ దేశ రాజ్యాంగ వ్యవస్థలో ప్రాంతీయ, సామాజిక ప్రతినిధిత్వానికి కూడా ప్రాధాన్యం ఉంది. అందువల్ల జనాభా మార్పులు రాజకీయ ప్రతినిధ్యంపై ప్రభావం చూపడం సహజం. ఒకవైపు అధిక జనాభా ఉన్న రాష్ట్రాలు ఎక్కువ రాజకీయ ప్రాతినిధ్యం కోరవచ్చు. మరోవైపు జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాలు తమ విజయానికి శిక్ష పడుతున్నట్లుగా భావించే పరిస్థితి ఏర్పడవచ్చు. దక్షిణ భారత రాష్ట్రాలు సంతానోత్పత్తి నియంత్రణలో ముందంజలో ఉన్నాయి. ఫలితంగా అవి వేగంగా వృద్ధాప్య దశలోకి వెళ్తున్నాయి. ఉత్తర భారతదేశంలోని కొన్ని రాష్ట్రాల్లో యువ జనాభా అధికంగా కొనసాగుతోంది. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ఈ విభిన్న జనాభా ధోరణులను నేరుగా రాజకీయ అధికారంతో అనుసంధానం చేసే అవకాశం ఉంది. ఇదే సమయంలో ప్రజలు ఉపాధి కోసం ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి భారీగా తరలుతున్నారు. 2011 జనగణన ప్రకారం దేశంలో దాదాపు 45 కోట్ల మంది మెరుగైన ఉపాధి కోసం ఒక చోట నుంచి మరో చోటకు వలస వెళ్తున్నారు. ధనికులు పెట్టుబడులు, అవకాశాల కోసం కదులుతుంటే పేదలు ఉపాధి కోసం కదులుతున్నారు. సుమారు ప్రతి సంవత్సరం రెండు లక్షల మంది భారత పౌరసత్వాన్ని వదులుకుంటున్నారన్న గణాంకం కూడా మరో మార్పును సూచిస్తోంది. ప్రజలు ఒక ప్రాంతంలో పుట్టినా మరో ప్రాంతంలో పనిచేసి అక్కడే స్థిరపడుతున్న పరిస్థితి పెరుగుతోంది. అయితే పన్నులు చెల్లించే ప్రాంతం, ఓటు వేసే ప్రాంతం, జన్మించిన ప్రాంతం, పనిచేసే ప్రాంతం వేర్వేరుగా మారితే ప్రజా ప్రాతినిధ్యం ఎలా ఉండాలి అన్న ప్రశ్న మరింత క్లిష్టమవుతుంది.

### • జనాభాను రాజకీయ ఆయుధంగా మార్చొద్దు

ప్రపంచవ్యాప్తంగా జనాభా మార్పులపై చర్చలు రెండు తీవ్ర ధోరణుల మధ్య చిక్కుకుంటున్నాయి. ఒక వర్గం తమ జనాభా తగ్గిపోతోందని భయపడుతూ "రీప్లేస్‌మెంట్" వంటి సిద్ధాంతాలను ముందుకు తెస్తోంది. మరో వర్గం జనాభా మార్పులపై ప్రతి చర్చను కుట్ర సిద్ధాంతంగా లేదా జాత్యహంకారంగా కొట్టిపారేస్తోంది. ఈ రెండు వైఖరులూ సమస్యను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడవు. జనాభా మార్పు వాస్తవం. అది సహజమైన సామాజిక పరిణామం. దాన్ని ఒక్కసారిగా రాజకీయ నిర్ణయాలతో వెనక్కి తిప్పడం సాధ్యం కాదు. జపాన్, దక్షిణ కొరియా, చైనా, ఇటలీ వంటి దేశాలు జననాలను పెంచేందుకు ఆర్థిక ప్రోత్సాహకాలు, పిల్లల సంరక్షణ సదుపాయాలు, తల్లిదండ్రుల సెలవులు, కుటుంబ సహాయ పథకాలు అమలు చేశాయి. అయినప్పటికీ గత దశాబ్దాల స్థాయికి సంతానోత్పత్తిని తీసుకురావడంలో అవి పూర్తిగా విజయం సాధించలేదు. దీనివల్ల ఒక విషయం స్పష్టమవుతుంది. ప్రజలు ఎక్కువ మంది పిల్లలను కనాలంటే కేవలం నగదు ప్రోత్సాహకాలు సరిపోవు. వారికి భద్రమైన ఉద్యోగం, అందుబాటులో ఉండే ఇల్లు, నాణ్యమైన విద్య, వైద్యం, పిల్లల సంరక్షణ, మహిళలకు ఉపాధి అవకాశాలు, స్థిరమైన భవిష్యత్తుపై విశ్వాసం అవసరం. భారతదేశంలోనూ ఇదే ఆలోచన ఉండాలి.

రాజకీయాలు

జనాభా మార్పుల నుంచి లాభం పొందే ప్రయత్నం నుంచి బయటకు వచ్చి వాటి పరిణామాలను సున్నితంగా నిర్వహించే దిశగా మారాలి. ఎవరి జనాభా ఎక్కువ అన్నదే ప్రధాన ప్రశ్న కాకుండా ఎవరు అభివృద్ధి అవకాశాలు పొందుతున్నారు. ఎవరి ప్రాంతంలో వృద్ధులు ఎక్కువవుతున్నారు, ఎక్కడ యువతకు ఉద్యోగాలు అవసరం, ఏ రాష్ట్రానికి ఎక్కువ వనరులు కావాలి, రాజకీయ ప్రాతినిధ్యం ఎలా బ్యాలెన్స్ చేయాలన్న ప్రశ్నలు ముందుకు రావాలి. ప్రజాస్వామ్యంలో సమూహ గుర్తింపులు సహజమే. కానీ ఆ గుర్తింపులను శాశ్వత రాజకీయ వైరంగా మార్చడం ప్రమాదకరం. భారత ప్రజాస్వామ్య భవిష్యత్తు జనాభా పరిమాణంపై కాదు, మారుతున్న జనాభా వాస్తవాలను ఎంత న్యాయంగా నిర్వహిస్తామన్న దానిపై ఆధారపడి ఉంటుంది. అందుకే "ప్రజలు" అనే భావనను మరింత విస్తృతంగా చూడాల్సిన సమయం వచ్చింది. ప్రాంతం, మతం, భాష, వయస్సు, వలస వంటి భేదాలను రాజకీయ ఆయుధాలుగా కాక ప్రజాస్వామ్య ప్రణాళికలో భాగాలుగా స్వీకరించినప్పుడే దేశ సమాఖ్య వ్యవస్థ బలపడుతుంది. జనాభా మార్పులను అడ్డుకోవడం కంటే వాటిని అర్థం చేసుకోవడం, వాటి వల్ల ఏర్పడే అసమానతలను తగ్గించడం, ప్రతి ప్రాంతానికి సమాన అవకాశాలు కల్పించడం, ప్రతి పౌరుడి రాజకీయ విలువను కాపాడటం భవిష్యత్ పాలనకు అసలైన పరీక్ష.



### • వృద్ధాప్యం, వలసలు రాష్ట్రాల మధ్య ఘర్షణ

జనాభా మార్పుల ప్రభావం ఎన్నికలకే పరిమితం కాదు. ప్రభుత్వాల ఆర్థిక ప్రణాళికలు కూడా దీనివల్ల మారాల్సి ఉంటుంది. వృద్ధుల సంఖ్య పెరిగే కొద్దీ పెన్షన్లు, వైద్య సేవలు, దీర్ఘకాలిక సంరక్షణ, సామాజిక భద్రత కోసం ప్రభుత్వ వనరుల అవసరం పెరుగుతుంది. పనిచేసే వయస్సులో ఉన్న ప్రజల సంఖ్య తగ్గిన రాష్ట్రాలకు మరో సమస్య ఎదురవుతుంది. యువత తక్కువగా ఉంటే పరిశ్రమలకు అవసరమైన కార్మికులు తగ్గవచ్చు. ఆర్థిక వృద్ధిపై ప్రభావం పడవచ్చు. అదే సమయంలో యువ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాలకు పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు సృష్టించాల్సిన అవసరం ఉంటుంది. ఒక ప్రాంతంలో మానవ వనరులు అధికంగా ఉంటే మరో ప్రాంతంలో వాటి కొరత ఏర్పడవచ్చు. ఫలితంగా అంతర్రాష్ట్ర వలసలు పెరుగుతాయి. దీనితో స్థానిక ఉపాధి, భాష, వనరులు, పన్నులు, సంక్షేమ పథకాలు వంటి అంశాలపై రాజకీయ ఉద్రిక్తతలు తలెత్తే అవకాశం ఉంది. జనాభా తేడాలు చివరకు ఆర్థిక వనరుల పంపిణీ, పన్నుల వాటా, కేంద్ర నిధులు, అభివృద్ధి ప్రాధాన్యతలు, రాజకీయ ప్రాతినిధ్యంపై ప్రభావం చూపవచ్చు. ఒక రాష్ట్రం "మేము కుటుంబ నియంత్రణ పాటించాం, ఇప్పుడు మా రాజకీయ ప్రాతినిధ్యం తగ్గకూడదు" అని వాదించవచ్చు. మరో రాష్ట్రం "మా జనాభా ఎక్కువగా ఉంది, మా ప్రజలకు తగిన ప్రాతినిధ్యం కావాలి" అని కోరవచ్చు. ఈ రెండు వాదనల్లోనూ రాజకీయ న్యాయం గురించి ప్రశ్నలు ఉన్నాయి. కాబట్టి జనాభా ఆధారిత ప్రతినిధ్యం, సామాజిక న్యాయం, సమాఖ్య సమతుల్యత మధ్య సరైన సమన్వయం అవసరం. భారతదేశ భవిష్యత్ రాజకీయ స్థిరత్వానికి జనాభా మార్పులను విభజనకు కారణంగా కాక సమాఖ్య సహకారానికి అవకాశంగా చూడటం అత్యవసరం.

### • జనాభా కాదు.. బ్యాలెన్స్ చేయడమే ముఖ్యం

చివరి ప్రశ్న "ఎవరి జనాభా ఎక్కువ?" అన్నది కాదు. ఎవరికెంత రాజకీయ శక్తి ఉండాలి? ఎవరి ప్రాంతానికి ఎంత వనరులు కావాలి? ఎవరి అభివృద్ధికి ఎంత మద్దతు అవసరం? అన్నదే అసలు ప్రశ్న. జనాభా తగ్గిన రాష్ట్రాలను వారి విజయానికి శిక్షించినట్లుగా చూడకూడదు. జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాలను వారి అవసరాల నుంచి దూరం చేయకూడదు. వృద్ధులు పెరుగుతున్న ప్రాంతాలకు సామాజిక భద్రత అవసరం. యువత అధికంగా ఉన్న ప్రాంతాలకు ఉద్యోగాలు, పెట్టుబడులు అవసరం. వలసలు పెరుగుతున్న ప్రాంతాలకు కొత్త పట్టణ ప్రణాళికలు, మౌలిక వసతులు అవసరం. అంటే జనాభా మార్పుకు ఒకే పరిష్కారం ఉండదు. ప్రాంతానికో విధానం.. సమాజానికో అవసరం.. తరానికో సవాలు ఉంటుంది. జననాల రేటు తగ్గుదలను కేవలం మతం, ప్రాంతం, జాతి కోణంలో చూడటం ప్రమాదకరం. అదే సమయంలో జనాభా మార్పులను కుట్రగా కొట్టిపారేయడం కూడా వాస్తవాన్ని దాచడమే. భారత ప్రజాస్వామ్యం ముందున్న అసలు పరీక్ష ఇదే. మారుతున్న జనాభాను రాజకీయ లాభాల కోసం రెచ్చగొట్టకుండా.. అభివృద్ధి, ప్రతినిధ్యం, సమాఖ్య బ్యాలెన్స్ కోసం ఎలా ఉపయోగించుకోవాలన్నదే కీలకం. జనాభాను రాజకీయ ఆయుధంగా మార్చితే విభజన పెరుగుతుంది. జనాభా వాస్తవాలను పాలనా ప్రణాళికగా మార్చితే ప్రజాస్వామ్యం బలపడుతుంది. రేపటి భారతదేశాన్ని నిర్ణయించేది జనాభా సంఖ్య మాత్రమే కాదు.. ఆ సంఖ్యల మధ్య న్యాయం చేసే రాజకీయ దూరదృష్టి.





# పదునెక్కిన మున్సిపోల్...

# జగన్ బస్తీమే సవాల్

## నాన్న మీద ఒట్టు.. పులివెందుల గెలుపు కోసం పట్టు

కడప రాజకీయాల్లో ఇప్పుడు మొదలైన కదలిక సాధారణ ఎన్నికల కసరత్తు కాదు. ఇది కోట గోడల్ని తడిమి చూస్తున్న సమయం. ఎవరి పునాది ఎంత గట్టిదో తేల్చుకునే సమయం. స్థానిక సంస్థల ఎన్నికలు రాష్ట్రవ్యాప్తంగా ఒక ఎత్తయితే.. ఉమ్మడి కడప జిల్లాలో మరో ఎత్తు. అందులోనూ పులివెందుల మున్సిపల్ పోరు మరొక ఎత్తు. ఎందుకంటే ఇది కేవలం చైర్మన్ కుర్చీ కోసం జరిగే పోరు కాదు. దశాబ్దాలుగా వైఎస్ కుటుంబ రాజకీయ ఆధిపత్యానికి చిరునామాగా ఉన్న గడ్డపై ఎవరి జెండా ఎగురుతుందన్న ప్రతిష్ఠాత్మక సమరం. కుప్పం మున్సిపాలిటీలో వైసీపీ గెలుపు కూటమికి గుచ్చుకున్న ముల్లు అయితే.. అదే ముల్లును పులివెందులలో తిరిగి గుచ్చాలని టీడీపీ భావిస్తోంది. "కుప్పంలో జరిగింది పులివెందులలో ఎందుకు జరగకూడదు?" అన్న ప్రశ్న ఇప్పుడు టీడీపీ వ్యూహకర్తల గుండెల్లో గుబులు కాదు.. గెలుపు పథకంగా మారుతోంది. మంత్రి నారా లోకేష్ ఈ విషయంలో పట్టుదలగా ఉన్నారన్న ప్రచారం ఆ పోరుకు మరింత వేడి పెంచుతోంది. అధికారంలో ఉన్న పార్టీకి పులివెందుల గెలుపు ఒక విజయం కావచ్చు. కానీ జగన్‌కు వ్యతిరేకంగా పులివెందుల గెలిస్తే.. అది కూటమికి రాజకీయంగా ఒక పెద్ద ట్రోఫీ. ఎందుకంటే పులివెందుల పేరు చెప్పగానే గుర్తొచ్చేది మున్సిపాలిటీ కాదు.. వైఎస్ కుటుంబం. కడప పేరు వినగానే రాజకీయంగా ముందుగా గుర్తుకొచ్చేది వైఎస్ కుటుంబమే. ఆ ముద్రను చెరిపేయాలని ప్రయత్నించడం ఒక ఎన్నికల వ్యూహం. ఆ ముద్రను నిలబెట్టుకోవడం వైసీపీకి రాజకీయ అస్తిత్వ సమస్య. అందుకే రెండు వైపులా ఈ పోరు అంత తేలికైనది కాదు.

### దుష్యంత్ చుట్టూ వైసీపీ వ్యూహం

ఈ నేపథ్యంలో వైసీపీ వ్యూహంలో చవ్వా దుష్యంత్‌రెడ్డి పేరు ముందుకు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. వైఎస్ జగన్‌కు సమీప బంధువైన దుష్యంత్‌కు కొంతకాలం క్రితం పులివెందుల బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి ఆయన కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో కలిసి నియోజకవర్గంలో తిరుగుతూ పార్టీ శ్రేణులతో మమేకమవుతున్నారు. కార్యకర్తల సమస్యలు అడిగి తెలుసుకోవడం, నాయకుల మధ్య సమన్వయం పెంచడం, పార్టీ కేడర్‌కు అందుబాటులో ఉండటం ద్వారా తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. రాజకీయాల్లో పదవి ముందుగా రావడం కంటే.. కార్యకర్తల మధ్య నిలబడే స్థానం ముందుగా సంపాదించుకోవడం ముఖ్యం. ఆ పని దుష్యంత్ చేస్తున్నారన్న భావన వైసీపీ వర్గాల్లో కనిపిస్తోంది. ఇదే కారణంతో పులివెందుల మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా దుష్యంత్‌రెడ్డిని నిలబెట్టాలన్న ఆలోచన జగన్‌కు ఉన్నట్టు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. రిజర్వేషన్ లెక్కలు అనుకూలిస్తే వైస్ చైర్మన్ స్థానానికి కూడా ఆయన పేరు పరిశీలనలోకి రావచ్చన్న ప్రచారం ఉంది. అయితే ఇక్కడ అసలు లెక్క పదవి కాదు.. అభ్యర్థి చుట్టూ పార్టీని ఏకతాటిపైకి తీసుకురావడం. జగన్ కుటుంబానికి దగ్గరి వ్యక్తి కావడం ఒక బలం. యువ నాయకుడిగా స్థానికంగా తిరగడం మరో బలం. క్లీన్ ఇమేజ్ ఉందన్న ప్రచారం ఇంకో బలం. ఈ మూడు బలాలను కలిపి ఎన్నికల బరిలోకి దిగితే.. వైసీపీ కేడర్‌లో ఉన్న చెల్లాచెదురును కొంత వరకు కట్టడి చేయవచ్చన్నది ఆ పార్టీ వ్యూహంగా కనిపిస్తోంది. అయితే రాజకీయాల్లో క్లీన్ ఇమేజ్ ఒక్కటే గెలుపు పత్రం కాదు. అభ్యర్థి వెనుక నిలబడే యంత్రాంగం కావాలి. వార్డు వారీగా బలమైన అభ్యర్థులు కావాలి. అసంతృప్తులను సముదాయించే నేర్పు కావాలి. ప్రత్యర్థి ఎత్తులను ముందుగానే పసిగట్టే రాజకీయ చాతుర్యం కావాలి. ముఖ్యంగా స్థానిక ఎన్నికల్లో వ్యక్తిగత పరిచయాలు, సామాజిక సమీకరణాలు, స్థానిక సమస్యలు, అభ్యర్థుల వ్యక్తిగత బలం... ఇవన్నీ కలిసే ఫలితాన్ని నిర్ణయిస్తాయి. కాబట్టి దుష్యంత్ పేరు ముందుకు రావడం వైసీపీకి ఒక వ్యూహాత్మక ఆయుధం కావచ్చు. కానీ ఆ ఆయుధం సరిగ్గా పనిచేయాలంటే పార్టీ యంత్రాంగం మొత్తం ఒకే దిశలో కదలాలి.

### జగన్‌కు ఇది మరో పరీక్ష

జగన్ రాజకీయ జీవితంలో పులివెందుల ఒక నియోజకవర్గం కాదు. అది ఆయన రాజకీయ మూలం. వైఎస్ రాజశేఖరరెడ్డి నుంచి జగన్ వరకు ఆ గడ్డతో ఏర్పడిన అనుబంధం ఒక సాధారణ ఓటు సంబంధం కాదు. తరతరాల రాజకీయ పరిచయం. ఎన్నో ఎన్నికల జ్ఞాపకం. కుటుంబానికి ఏర్పడిన భావోద్వేగ బంధం. అందుకే పులివెందులలో వైసీపీ ఓడిపోతే దాని ప్రభావం కేవలం మున్సిపల్ ఫలితాలకే పరిమితం కాదు. దాన్ని ప్రత్యర్థి పార్టీ రాజకీయ ప్రచారంలో పెద్ద ఆయుధంగా మలచుకునే అవకాశం ఉంది. 2024 ఎన్నికలు వైఎస్ కుటుంబానికి, ముఖ్యంగా జగన్‌కు రాజకీయంగా గట్టి దెబ్బ ఇచ్చాయి. కడప జిల్లాలోనూ కూటమి గణనీయమైన స్థానాలను కైవసం చేసుకుంది. ఒకప్పుడు ప్రత్యర్థులకు అందని ద్రాక్షగా కనిపించిన ప్రాంతాల్లో కూటమి జెండాలు ఎగిరాయి. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉపఎన్నికల ఫలితాలు కూడా వైసీపీ శిబిరంలో ఆత్మపరిశీలనకు కారణమయ్యాయి. ఒక్క ఓటమిని అదృష్టం అంటారు. రెండో ఓటమిని పరిస్థితులు అంటారు. కానీ వరుస పరిణామాలు కనిపిస్తే.. వాటి వెనుక రాజకీయ మార్పును గుర్తించాల్సిందే. అందుకే ఇప్పుడు జగన్ ముందు ఉన్న అసలు సవాల్ అధికారం తిరిగి సాధించడమే కాదు. తనకు బలమైన ప్రాంతాల్లో పార్టీ పునాదులు కదలలేదని నిరూపించడం. "ప్రభుత్వం వాళ్లది కాబట్టి సీట్లన్నీ వాళ్లకే వెళ్లిపోవాలా?" అన్న ప్రశ్నను పార్టీ శ్రేణులలో నాటాలని ఆయన ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. అధికార పార్టీకి అధికారం ఉండొచ్చు.. కానీ ఓటు మాత్రం ప్రజల చేతిలోనే ఉంటుంది. ప్రభుత్వ యంత్రాంగం ఎన్నికలు నిర్వహిస్తుంది.. ప్రజలు ఫలితం రాస్తారు. ఈ తేడాను వైసీపీ కేడర్‌కు గుర్తు చేయాల్సిన అవసరం జగన్‌కు ఏర్పడింది.

### కడపలో ఒక్క సీటు కాదు.. సంకేతం ముఖ్యం

ఉమ్మడి కడప జిల్లాలో జరిగే ప్రతి ఎన్నికకు ఇప్పుడు ప్రత్యేక రాజకీయ ప్రాధాన్యం ఏర్పడింది. రాష్ట్రంలో వందలాది స్థానాలు గెలిచినా.. కడపలో ఒక కీలక స్థానం కోల్పోతే దాని ప్రచార విలువ వేరు. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతికూల ఫలితాలు వచ్చినా.. కడపలో వైసీపీ తన పాత పట్టు నిలబెట్టుకుంటే జగన్‌కు అది రాజకీయంగా ఊరటనిచ్చే అంశం అవుతుంది. అందుకే ఇక్కడ లెక్క సీట్లది కాదు.. సంకేతాలది. కూటమి ఒక బలమైన ప్రాంతంలో అడుగు పెడితే.. "వైఎస్ కుటుంబ కోటకు బీటలు" అని ప్రచారం మొదలవుతుంది. వైసీపీ తన బలమైన ప్రాంతాన్ని నిలబెట్టుకుంటే.. "2024 ఓటమి తర్వాత కూడా కడపలో పట్టు చెక్కుచెదరలేదు" అని చెప్పుకునే అవకాశం వస్తుంది. ఒకే ఫలితానికి రెండు రాజకీయ కథనాలు పుట్టే పరిస్థితి. అందుకే పులివెందుల మున్సిపాలిటీపై రెండు పార్టీల కన్ను అంత గట్టిగా ఉంది. ఇక్కడ మరో విషయం కూడా కీలకం. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు పార్టీ గుర్తు కంటే వ్యక్తిని కూడా చూస్తారు. ఎవరు తమ మధ్య తిరిగారు? ఎవరు సమస్య వచ్చినప్పుడు నిలబడ్డారు? ఎవరు కష్టకాలంలో కనిపించారు? ఎవరు ఎన్నికల ముందు మాత్రమే వచ్చారు? ఈ ప్రశ్నలకు స్థానిక ఓటరు తనదైన లెక్క వేస్తాడు. అందుకే పులివెందులలో కేవలం జగన్ పేరు చెప్పడం వైసీపీకి సరిపోదు. అదే విధంగా కూటమి ప్రభుత్వం ఉందన్న కారణంతో టీడీపీకి గెలుపు వచ్చేస్తుందని అనుకోవడం కూడా రాజకీయ అమాయకత్వమే.

### కూటమి వ్యూహం.. కోట గుమ్మం దగ్గరే పరీక్ష

టీడీపీకి పులివెందుల మున్సిపాలిటీ గెలుపు ఒక రాజకీయ ప్రయోగశాల లాంటిది. కుప్పం మున్సిపాలిటీలో వైసీపీ సాధించిన విజయం టీడీపీకి ఒక రాజకీయ సవాల్‌గా కనిపిస్తే.. దానికి సమాధానం పులివెందులలో ఇవ్వాలని భావించడం సహజమే. "మీ కోటలో మేం కూడా జెండా ఎగరేయగలం" అనే సందేశాన్ని పంపడానికి పులివెందుల కంటే సరైన వేదిక మరొకటి ఉండకపోవచ్చు. కానీ కోట గుమ్మం కనిపించడం ఒకటి.. లోపలికి వెళ్లడం మరోటి. పులివెందులలో కూటమికి అసలు పరీక్ష అక్కడే. అభ్యర్థుల ఎంపికలో చిన్న పొరపాటు జరిగినా.. స్థానిక అసంతృప్తి పెద్ద సమస్యగా మారవచ్చు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు సమన్వయంతో పని చేయకపోతే ఓట్ల చీలిక తప్పదు. స్థానికంగా ఉన్న వర్గ విభేదాలు, వ్యక్తిగత రాజకీయాలు, అభ్యర్థుల మధ్య పోటీ... ఇవన్నీ కూటమి విజయాన్ని ప్రభావితం చేయగలవు. కాబట్టి పులివెందుల గెలవాలంటే కేవలం అధికార బలం చూపిస్తే సరిపోదు. ప్రజల్లోకి వెళ్లాలి. స్థానిక సమస్యలను పట్టుకోవాలి. ప్రతి వార్డును ప్రత్యేక నియోజకవర్గంగా చూడాలి. ప్రతి ఓటును గెలుపు ఓటుగా భావించాలి. ప్రత్యర్థి బలహీనతలపై ఆధారపడకుండా సొంత బలాన్ని నిర్మించాలి. లేకపోతే "కోటను కొట్టడానికి వచ్చాం" అన్న ప్రచారం చివరికి "గుమ్మం దగ్గరే తిరిగి వెళ్లాం" అన్న ఎద్దేవాగా మారే ప్రమాదం ఉంది.

### జగన్ చెప్పే 'నాదే కడప'కు అసలు అర్థం

"నాన్న మీద ఆన.. నాదే కడప.. నేనుండేది పులివెందుల" అనే భావన వెనుక అసలు రాజకీయ అర్థం ఇదే. తండ్రి నిర్మించిన రాజకీయ వారసత్వాన్ని కొడుకు కాపాడగలడా? వైఎస్ రాజశేఖరరెడ్డి కాలంలో కడపలో ఏర్పడిన ప్రభావాన్ని జగన్ తన రాజకీయ జీవితంలో కొనసాగించగలడా? 2024లో వచ్చిన రాజకీయ తుఫాను తాత్కాలికమా? లేక కడపలో కొత్త రాజకీయ శకం మొదలైందా? స్థానిక సంస్థల ఎన్నికలు ఈ ప్రశ్నలకు మొదటి సమాధానం ఇవ్వబోతున్నాయి. వైఎస్ కుటుంబం కడపలో ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా, ముఖ్యమంత్రులుగా ఎదిగిన రాజకీయ చరిత్రను ఒక్క ఎన్నికతో కొలవలేం. కానీ అదే చరిత్రను శాశ్వత రక్షణ కవచంగా కూడా భావించలేం. ప్రజల అభిమానం రాజకీయ ఆస్తి కావచ్చు.. కానీ ఆ ఆస్తిని కాపాడుకోవడానికి ప్రతి ఎన్నికలో పని చేయాల్సిందే. గతంలో గెలిచాం కాబట్టి ఇకపై కూడా గెలుస్తామని అనుకునే నాయకుడిని ప్రజలు ఒక్క క్షణంలో నేల మీదకు దించగలరు. జగన్‌కు ఇప్పుడు కావాల్సింది నినాదం కాదు.. నిరూపణ. కడపలో వైఎస్ కుటుంబ ప్రభావం ఇంకా సజీవంగా ఉందనే నిరూపణ. పులివెందులలో తన రాజకీయ పునాది చెక్కుచెదరలేదని రుజువు. పార్టీ కార్యకర్తల్లో ఇంకా పోరాట స్ఫూర్తి ఉందని ధీమా. ప్రత్యర్థి అధికారం ముందు వైసీపీ కేడర్ మోకరిల్లలేదన్న గడుసుతనం. అదే సమయంలో టీడీపీకి కూడా ఇదే పరీక్ష. కూటమి అధికారంలోకి వచ్చిందని కడపలో రాజకీయ చరిత్రను రాత్రికి రాత్రే తిరగరాయలేరు. ప్రజల మనసులో పాతుకుపోయిన కుటుంబ రాజకీయ ప్రభావాన్ని ఎదుర్కోవాలంటే కేవలం అధికార ముద్ర సరిపోదు. ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని నిర్మించాలి. స్థానికంగా నమ్మకం సంపాదించాలి. కేడర్‌ను కదిలించాలి. ఎన్నికల రోజు వరకు ఒకే జెండా కింద ఒకే లక్ష్యంతో నడవాలి.

### ఒక్క ఓటు.. ఎన్నో రాజకీయ సంకేతాలు

పులివెందులలో తీర్పు వెలువడిన తర్వాత గెలిచిన పార్టీ చేతిలో మున్సిపల్ పీఠం ఉంటుంది. కానీ ఆ ఫలితంతో ఆగిపోయే కథ కాదు ఇది. అక్కడ పడిన ప్రతి ఓటు కడప రాజకీయాల్లో ఒక సందేశాన్ని మోసుకొస్తుంది. వైసీపీ విజయం సాధిస్తే.. 2024 తర్వాత కూడా వైఎస్ జగన్‌కు పులివెందుల ప్రజల్లో బలమైన పట్టు ఉందన్న వాదనకు బలం చేకూరుతుంది. వైఎస్ కుటుంబ రాజకీయ ప్రభావం అంతమైందన్న ప్రచారానికి కూడా అది గట్టి సమాధానంగా నిలుస్తుంది. అదే సమయంలో కూటమి విజయం సాధిస్తే.. ఇన్నాళ్లుగా ప్రత్యర్థులకు అందని దూరంగా కనిపించిన వైఎస్ కుటుంబ రాజకీయ కోటలోకి అధికార పక్షం ప్రవేశించిందన్న ప్రచారం ఊపందుకుంటుంది. కడపలో కొత్త రాజకీయ సమీకరణాలకు అది బీజం వేయవచ్చు. అయితే ఒక్క ఎన్నికతో ఒక కుటుంబ రాజకీయ భవిష్యత్తును తేల్చడం ఎంత తొందరపాటో.. ఒక్క విజయంతో కోట శాశ్వతమని భావించడం కూడా అంతే ప్రమాదకరం. రాజకీయాల్లో ప్రజల తీర్పే అంతిమ ప్రమాణం. నాయకుల హామీలు, కార్యకర్తల లెక్కలు, ప్రత్యర్థుల వ్యూహాలు అన్నీ పోలింగ్ బూత్ వద్దే పరీక్షకు వస్తాయి. అందుకే ఇప్పుడు కడప చూపంతా పులివెందులపైనే. జగన్ పంతం నిలుస్తుందా? కూటమి సవాల్ ఫలిస్తుందా? వైఎస్ జెండా మరోసారి ఎగురుతుందా? లేక కొత్త జెండాకు కోట తలుపులు తెరుచుకుంటాయా? సమాధానం చెప్పేది ఒక్కటే.. ప్రజల ఓటు.

### రాచమల్లు సవాల్ వెనుక లెక్కేమిటి?

వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి కూటమి నేతలకు సవాళ్లు విసరడం కూడా ఈ రాజకీయ వాతావరణంలో భాగమే. "దమ్ముంటే ఒక్క చోటైనా ఏకగ్రీవం చేసుకోండి" అనే సవాల్ సాధారణ రాజకీయ ప్రకటన కాదు. ప్రత్యర్థి శిబిరంలో మానసిక ఒత్తిడి పెంచే ప్రయత్నం. కడపలో కూటమి బలం పెరుగుతోందన్న ప్రచారానికి ఎదురుగా వైసీపీ కూడా తన కండబలం చూపించాలన్న ప్రయత్నం. జమ్మలమడుగుకు చెందిన వైసీపీ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి హెచ్చరికలు కూడా అదే వరుసలో చూడాలి. మాటలు గట్టిగా ఉన్నాయి. సవాళ్లు పదునుగా ఉన్నాయి. కానీ ఎన్నికల రాజకీయాల్లో ఒక సామెత ఉంది... "మాటకు బలం ఉండాలి.. బలానికి ఓటు ఉండాలి." సభలో గట్టిగా మాట్లాడటం వేరు. గ్రామంలో గెలవడం వేరు. ప్రత్యర్థిని బెదిరించడం వేరు. ఓటరును ఒప్పించడం వేరు. కాబట్టి ఇప్పుడు వైసీపీ నేతలు విసురుతున్న సవాళ్లకు అసలు సమాధానం ఎన్నికల ఫలితాలే. అయితే ఈ ధీమా వెనుక జగన్ వ్యూహం ఉందన్న విశ్లేషణ కూడా వినిపిస్తోంది. జిల్లాలో కేడర్‌ను "వెనక్కి తగ్గొద్దు.. తలవంచొద్దు.. పోరాడండి" అనే మానసిక స్థైర్యం ఇవ్వడం అవసరమని జగన్ భావిస్తున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఓటమి తర్వాత పార్టీకి పెద్ద ప్రమాదం ప్రత్యర్థి బలం కాదు.. సొంత శ్రేణుల్లో పుట్టే నిరుత్సాహం. ఆ నిరుత్సాహం మొలకెత్తకముందే కత్తిరించాలన్న ప్రయత్నంగా ఈ సవాళ్లను చూడవచ్చు.

# పాక్ క్రికెట్‌లో మరో కలకలం

## హర్షా భోగ్లే ఒక్క పోస్ట్‌తో ఫైర్





ఇంగ్లాండ్‌తో టెస్ట్ సిరీస్‌లో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తీసుకున్న నిర్ణయాలు తీవ్ర చర్చకు దారితీశాయి. మూడు టెస్టుల సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌లు ఓడిన వెంటనే ఏకంగా ఏడుగురు ఆటగాళ్లను జట్టు నుంచి తప్పించి స్వదేశానికి పంపడం సంచలనంగా మారింది. వికెట్ కీపర్ మహ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్, తొలి టెస్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన సల్మాన్ అఘా సహా ఏడుగురిని పీసీబీ విడుదల చేసింది. అంతేకాదు.. సిరీస్ మధ్యలోనే హెడ్ కోచ్, బౌలింగ్ కోచ్‌లను కూడా మార్చింది. ఈ పరిణామాలపై ప్రముఖ భారత క్రికెట్ వ్యాఖ్యాత హర్షా భోగ్లే ఘాటుగా స్పందించారు. "పాకిస్థాన్ క్రికెట్ నుంచి నమ్మశక్యం కానిదాన్ని ఆశించొచ్చు" అన్న రీతిలో ఆయన సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. సిరీస్ మధ్యలోనే కోచ్‌లను తొలగించడం, కీలక ఆటగాళ్లను ఇంటికి పంపడం, కొత్త ఆటగాళ్లను హడావుడిగా తీసుకురావడం పాకిస్థాన్ క్రికెట్ నిర్వహణ తీరుపై ప్రశ్నలు రేపింది. కొత్తగా ఎంపికైన వారిలో ఐదుగురు ఆటగాళ్లు ఇప్పటివరకు టెస్టుల్లో అరంగేట్రం చేయలేదు. సైమ్ అయూబ్, అబ్దుల్లా ఫజల్ వంటి ఆటగాళ్లకు కూడా పరిమిత అంతర్జాతీయ అనుభవమే ఉంది. కొత్త ఆటగాళ్లకు వీసాలు రావాల్సి ఉండటంతో వారు సకాలంలో ఇంగ్లాండ్‌కు చేరతారా అన్న అనుమానాలు కూడా వ్యక్తమయ్యాయి. వైట్ బాల్ కోచ్ మైక్ హేసన్, బౌలింగ్ కోచ్ యాష్లీ నోఫ్కేలను టెస్ట్ జట్టు బాధ్యతల్లోకి తీసుకొచ్చారు. సిరీస్ మధ్యలో ఇంత భారీ మార్పులు చేయడం అసాధారణమని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# అఫ్గాన్‌తో టీ20లకు భారత్ రెడీ

## బుమ్రా రీఎంట్రీ.. హార్దిక్‌కు నో స్పేస్



అఫ్గానిస్థాన్‌తో జరగనున్న మూడు టీ20ల సిరీస్‌కు భారత జట్టును బీసీసీఐ సెలక్షన్ కమిటీ ప్రకటించింది. సెప్టెంబర్ 13న న్యూఢిల్లీలో ప్రారంభమయ్యే సిరీస్‌కు స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి వచ్చాడు. జూలై 16న ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డేలో ఎడమ మోకాలికి గాయం కావడంతో బుమ్రా జట్టుకు దూరమయ్యాడు. తాజాగా ఫిట్‌నెస్ క్లియరెన్స్‌కు లోబడి అతడిని ఎంపిక చేశారు. గాయాల నుంచి కోలుకున్న నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణాలకు కూడా జట్టులో చోటు దక్కింది. అయితే వారి తుది లభ్యత ఫిట్‌నెస్ పరీక్షలపై ఆధారపడి ఉంటుందని బీసీసీఐ స్పష్టం చేసింది. పేస్ విభాగంలో బుమ్రాతో పాటు అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా ఉండగా, స్పిన్ బాధ్యతలు వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్ చేపట్టనున్నారు.

### వైభవ్‌కు మరో అవకాశం

భారత టీ20 జట్టులో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి మరో అవకాశం లభించింది. జింబాబ్వేతో సిరీస్‌లో ఆకట్టుకున్న వైభవ్.. అఫ్గాన్‌పై టాప్ ఆర్డర్‌లో కీలక ఆటగాడిగా మారనున్నాడు. అతడితో పాటు అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ బ్యాటింగ్ బలాన్ని పెంచనున్నారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, వైస్ కెప్టెన్ తిలక్ వర్మ, శివమ్ దూబే మిడిల్ ఆర్డర్‌లో ఉన్నారు. అక్షర్ పటేల్, నితీశ్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్ ఆల్‌రౌండర్లుగా ఎంపికయ్యారు. అయితే స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాకు ఈ జట్టులో చోటు దక్కలేదు. అఫ్గాన్ సిరీస్ జట్టు ఈ నెలలో జపాన్‌లో జరగనున్న 2026 ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత జట్టుకు దాదాపు సమానంగా ఉంది. దీంతో యువ ఆటగాళ్లకు అంతర్జాతీయ వేదికపై తమ సత్తా చాటుకునే కీలక అవకాశం లభించింది.

# కార్గిల్ వీరులకు సచిన్ సెల్యూట్

### 'ఆపరేషన్ సఫేద్ సాగర్'పై భావోద్వేగం

'ఆపరేషన్ సఫేద్ సాగర్'ను చూసిన తర్వాత తనలో ఎన్నో ఆలోచనలు కలిగాయని క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్ తెలిపారు. సరిహద్దుల్లో దేశ రక్షణ కోసం విధులు నిర్వర్తించే సైనికులు ఒత్తిడి, అనిశ్చితి మధ్య జీవిస్తుంటే.. మనం మాత్రం ప్రశాంతంగా నిద్రపోతూ సాధారణ జీవితాన్ని కొనసాగిస్తున్నామని ఆయన గుర్తుచేశారు. ఎన్నో ఏళ్ల క్రితం ఎయిర్ చీఫ్ మార్షల్ బీఎస్ ధనోవాను తాను కలిశానని సచిన్ చెప్పారు. ఇప్పుడు 'ఆపరేషన్ సఫేద్ సాగర్'లో కార్గిల్ యుద్ధ సమయంలో ఆయనతో పాటు ఎంతోమంది ఎదుర్కొన్న పరిస్థితులను చూసిన తర్వాత ఆ నాటి సమావేశాన్ని మరింత లోతైన గౌరవంతో గుర్తు చేసుకున్నానన్నారు. దేశం కోసం వారు ప్రదర్శించిన ధైర్యం అసాధారణమని, దాని వెనుక ఉన్న క్రమశిక్షణ, మానసిక స్థైర్యం మరింత గొప్పవని సచిన్ పేర్కొన్నారు. భారత వాయుసేనతో తనకు అనుబంధం ఉండటం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. వాయుసేన విలువలను అర్థం చేసుకునే అవకాశం తనకు లభించిందన్నారు. ఈ కథను చూసిన తర్వాత తనలో కృతజ్ఞత మరింత పెరిగిందని చెప్పారు.



దేశ ప్రజల కోసం సేవలందిస్తున్న భారత వాయుసేన సిబ్బందికి "మీరు చేస్తున్న ప్రతి పనికి ధన్యవాదాలు.. జైహింద్" అంటూ సచిన్ భావోద్వేగంగా సెల్యూట్ చేశారు.

# కోచ్ కోసం పాక్ కొత్త ప్రయోగం

## లింక్డ్ఇన్‌లో ప్రకటన.. నెటిజన్ల ట్రోలింగ్

పాకిస్థాన్ క్రికెట్‌లో మార్పుల పర్వం కొనసాగుతోంది. తాజాగా జాతీయ జట్టుకు కొత్త ఫీల్డింగ్ కోచ్ కోసం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు లింక్డ్ఇన్‌లో అధికారికంగా ఉద్యోగ ప్రకటన ఇవ్వడం ఆసక్తికరంగా మారింది. షేన్ మెక్‌డెర్మాట్ పదవీకాలం ముగిసిన నేపథ్యంలో అన్ని ఫార్మాట్లలో సీనియర్ పురుషుల జట్టుకు పనిచేసే కొత్త ఫీల్డింగ్ కోచ్‌ను ఎంపిక చేయాలని బోర్డు నిర్ణయించింది. పాకిస్థాన్ ఫీల్డింగ్ ప్రమాణాలపై ఇటీవల తీవ్ర విమర్శలు వస్తున్న సమయంలో ఈ నియామకానికి ప్రాధాన్యం ఏర్పడింది. అభ్యర్థికి కనీసం లెవల్ 2 క్రికెట్ కోచింగ్ అర్హత, ఐదేళ్ల అనుభవం ఉండాలని పీసీబీ స్పష్టం చేసింది. ఎలైట్ ఆటగాళ్లు, జాతీయ జట్లు లేదా ఫ్రాంచైజీ జట్లతో పనిచేసిన అనుభవం కూడా తప్పనిసరిగా ఉండాలని పేర్కొంది. అయితే కోచ్ నియామకానికి లింక్డ్ఇన్‌ను ఉపయోగించడం సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది. ఇప్పటికే ఇంగ్లాండ్‌తో టెస్ట్ సిరీస్ వైఫల్యం తర్వాత ఏడుగురు ఆటగాళ్లను జట్టు నుంచి తొలగించడం, కోచింగ్ సిబ్బందిలో భారీ మార్పులు చేయడంతో పాక్ క్రికెట్ బోర్డు తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితుల్లో ఫీల్డింగ్ కోచ్ కోసం లింక్డ్ఇన్‌లో ప్రకటన చేయడంపై నెటిజన్లు వ్యంగ్యంగా స్పందిస్తూ పీసీబీ తీరును ట్రోల్ చేస్తున్నారు.






## కరీనా కపూర్ క్రైమ్ థ్రిల్లర్ 'దయారా'

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనా కపూర్ ఖాన్ మరియు టాలెంటెడ్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా క్రైమ్ థ్రిల్లర్ 'దయారా'. ప్రముఖ దర్శకురాలు మేఘనా గుల్జార్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ చిత్రంలో కరీనా కపూర్ ఖాన్ డీసీపీ అజూని కోహ్లీగా, పృథ్వీరాజ్ సుకుమారన్ డీసీపీ రామన్ కుమార్‌గా ప్రత్యర్థి పోలీసు అధికారులుగా కనిపించనున్నారు. చట్టం వర్సెస్ న్యాయం, నకిలీ ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. జంగ్లీ పిక్చర్స్ మరియు పెన్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాను మేఘనా గుల్జార్ యదార్థ ఘటనల ఆధారిత సీరియస్ డ్రామాగా మలిచారు. సస్పెన్స్ మరియు హై 'వోల్టేజ్ డ్రామాతో కూడిన ఈ క్రైమ్ థ్రిల్లర్ ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 18న విడుదల కానుండగా, ప్రస్తుతం ఈ ట్రైలర్ సినీ వర్గాల్లో భారీ అంచనాలను పెంచేసింది.

# నవంబర్ 27న మైసా

### రిలీజ్ డేట్ ప్రకటించిన మేకర్స్

కథానాయిక రష్మిక ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' రవీంద్ర పుల్లె తెరకెక్కిస్తున్నారు. తాజాగా చిత్రబృందం ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేసింది. ఈ చిత్రాన్ని నవంబరు 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ రిలీజ్ డేట్ ప్రకటన సందర్భంగా మేకర్స్ పంచుకున్న క్యాప్షన్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. సహజంగానే ఆమె దృఢమైనది.. ఎంచుకున్న మార్గంలో భయం లేనిది.. చెక్కు చెదరని ఆత్మవిశ్వాసం ఆమె సొంతం. మును పెన్నడూ చూడని విధంగా 'మైసా' ప్రపంచంలో రష్మికను చూసేందుకు సిద్ధంగా ఉండండి అంటూ చిత్ర బృందం సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. మును పెన్నడూ లేని విధంగా రష్మిక ఈ సినిమాలో పూర్తిస్థాయి యాక్షన్ పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి. రష్మిక కథానాయిక. దసరా కానుకగా అక్టోబరు 16న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ఇటీవలే చిత్ర బృందం స్పష్టం చేసింది.




# మూడు సినిమాలతో మమిత బైజు హ్యాట్రిక్

'ప్రేమలు'తో ఒక్కసారిగా యూత్ క్రష్‌గా మారిన మమితా బైజు .. ఇప్పుడు ఇండస్ట్రీలో క్రేజీ హీరోయిన్‌గా మారింది. తన క్యూట్‌నెస్‌తో కట్టిపడేసే ఈ మలయాళ ముద్దుగుమ్మ.. తాజాగా భారతీయ సినీ చరిత్రలోనే ఎవరూ సాధించని ఒక అరుదైన మైలురాయి చేరుకుంది. కేవలం 29 రోజుల వ్యవధిలో ఈ అమ్మడు నటించిన మూడు సినిమాలు వరుసగా రూ.200 కోట్లకు పైగా వసూలు చేసి.. హ్యాట్రిక్ కొట్టిన తొలి భారతీయ నటిగా చరిత్ర సృష్టించింది. ఎన్నో వాయిదాల తర్వాత జులై 23న వచ్చిన 'జననాయగన్' విజయాన్ని అందుకుంది. విజయ్ నటించిన చివరి చిత్రం కావడంతో భారీ అంచనాలు ఉండడంతో బాక్సాఫీస్ వద్ద ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. ఇందులో మమిత.. విజ్జి పాత్రలో ఆకట్టుకుంది. సూర్య కథానాయకుడిగా విశ్వనాథ్ అండ్ సన్స్..: భారీ చిత్రం విడుదలైన కొద్దిరోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.240 కోట్ల గ్రాస్‌తో ఘన విజయం సాధించింది. ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాలో మమిత నటన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అల్లరి చేసే పిల్లగా ఆకట్టుకున్న ఆమె.. అమ్మగానూ హృదయానికి హత్తుకునే నటనతో మెప్పించింది. బెత్లె కుటుంబ యూనిట్..: నివిన్ పౌలీతో కలిసి మమిత నటించిన ఈ మలయాళ చిత్రం ఆగస్టు 21న విడుదలై సంచలనం విజయం అందుకుంది. ఇప్పటికే రూ.200 కోట్ల మార్క్ దాటి రూ.250 కోట్ల దిశగా దూసుకుపోతోంది. దీన్నే తెలుగులో సెప్టెంబరు 4న విడుదల చేయనున్నారు.






# మారెమ్మ ట్రైలర్ విడుదల

మాస్ మహారాజ రవితేజ సోదరుడి తనయుడు మాధవ్ భూపతిరాజు ప్రధాన పాత్రలో తెరకెక్కిన విలేజ్ యాక్షన్ డ్రామా 'మారెమ్మ' ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో వచ్చిన టీజర్‌తో సినిమాపై ఆసక్తిని పెంచిన చిత్రబృందం.. ఇప్పుడు ట్రైలర్ ద్వారా కథకు సంబంధించిన మరిన్ని ఆసక్తికర అంశాలను ప్రేక్షకులకు పరిచయం చేసింది. గ్రామీణ నేపథ్యం, దైవ విశ్వాసాలు, మూఢనమ్మకాలు, యాక్షన్ అంశాలను మేళవిస్తూ ఈ సినిమాను తెరకెక్కించినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. కథ విషయానికి వస్తే.. ఓ సంక్షోభంలో చిక్కుకున్న గ్రామస్తులు తమ గ్రామ దేవత మరెమ్మ తల్లిపై నమ్మకం పెట్టుకుంటారు. అయితే అమ్మవారికి సంబంధించిన పవిత్రమైన ఎద్దు అనూహ్యంగా కనిపించకుండా పోవడంతో గ్రామంలో ఒక్కసారిగా భయాందోళనలు మొదలవుతాయి. ఆ ఎద్దు అదృశ్యం కావడం వెనుక ఏదో పెద్ద కారణం ఉందని గ్రామస్తులు భావిస్తారు. ఈ పరిణామాల నేపథ్యంలో యువ కథానాయకుడిపై ఆ ఎద్దును వెతికి తీసుకురావాల్సిన బాధ్యత పడుతుంది. ఎద్దు కోసం అతడు చేసే అన్వేషణ క్రమంలో ఎన్నో ఊహించని పరిణామాలు ఎదురవుతాయి. గ్రామంలో పాతుకుపోయిన నమ్మకాలు, స్థానిక రాజకీయాలు, ఆధిపత్య పోరాటాలు అతడి ప్రయాణాన్ని మరింత ప్రమాదకరంగా మారుస్తాయి. ఈ క్రమంలో హీరో పలు హింసాత్మక సంఘర్షణల్లో చిక్కుకున్నట్లు ట్రైలర్‌లో చూపించారు.అయితే 'మారెమ్మ' కథలో అసలు మిస్టరీ ఏమిటన్నది మాత్రం ట్రైలర్‌లో పూర్తిగా రివీల్ చేయలేదు. పవిత్రమైన ఎద్దు ఎందుకు కనిపించకుండా పోయింది? దాని వెనుక ఎవరి హస్తం ఉంది? హీరో ఎదుర్కొనే సమస్యలకు, గ్రామ దేవత నమ్మకాలకు ఉన్న సంబంధం ఏమిటి? అనే ప్రశ్నలను అలాగే ఉంచుతూ ట్రైలర్‌ను ఆసక్తికరంగా కట్ చేశారు. ముఖ్యంగా గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే విజువల్స్, యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తున్నాయి. ఉత్కంఠభరితమైన సన్నివేశాలకు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మరింత బలాన్ని చేకూర్చింది. సాధారణ విలేజ్ డ్రామాకు భిన్నంగా దైవ విశ్వాసం, గ్రామీణ ఆచారాలు, మిస్టరీ, యాక్షన్ అంశాలను కలిపి కథను నడిపించినట్లు తెలుస్తోంది.ఈ చిత్రంలో దీపా బాలు కథానాయికగా నటించగా.. వికాస్ వశిష్ట, వినోద్ కుమార్, వీఎస్ రూపలక్ష్మి, దయానంద్ రెడ్డి తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మయూర్ రెడ్డి బండారు నిర్మిస్తున్న ఈ చిత్రానికి మంచాల నాగరాజు దర్శకత్వం వహిస్తున్నారు.ట్రైలర్‌తో సినిమాపై మరింత ఆసక్తిని పెంచిన 'మారెమ్మ' సెప్టెంబర్ 10న థియేటర్లలోకి రానుంది. గ్రామీణ నేపథ్యంలోని మిస్టరీ, యాక్షన్ కథలను ఇష్టపడే ప్రేక్షకులకు ఈ సినిమా ఎలాంటి అనుభూతిని అందిస్తుందో చూడాలి.

This newspaper is Owned and Published by GUNDEBOINA VENKANNA from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: GUNDEBOINA VENKANNA and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: TGBIL/26/A6717. www.rajyasamskarana.com.